www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
గురువారం 26, జూన్, 2025 | పేజీలు :12

## భీమవరం ఎమ్మెల్యే కొడుకు... గంటా అల్లుడు కోసం తెలంగాణ నార్కో టీమ్ వెతుకుతోందా?



క్రికెట్ ఫ్రాంచైజీల వివాదంతో తెరపైకి ప్రశాంత్
పేకాట, వైన్స్ బిజినెస్‌లో వినిపించిన ప్రశాంత్ పేరు
కొత్తగా డ్రగ్స్ కూడా తీసుకుంటారంటూ ప్రచారం..?
డ్రగ్ అడిక్ట్ ఏసీఏకి వైస్ ప్రెసిడెంట్‌గా ఎలా ఉంటారు..?
డ్రగ్స్ తీసుకున్నట్లు రుజువైతే ప్రశాంత్‌కు ట్రబుల్సే..!

02

# మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమే..
# పారిశ్రామిక వేత్తలకు సీఎం హామీ

### ధైర్యంగా పెట్టుబడులు పెట్టండి
### మరోసారి ఆ భూతం రాకుండా చూసుకుంటా..!
### వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే అధిక ప్రోత్సహకాలు
### ఫిక్కీ జాతీయ కార్యవర్గ భేటీలో చంద్రబాబు హామీ

**టీపీఎన్, విజయవాడ:**

రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు ఏపీ సీఎం చంద్రబాబు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు సీఎం. విజయవాడలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) జాతీయ కార్యవర్గ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిక్కీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కీలక కామెంట్స్ చేశారు. మోదీ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ లక్ష్యం నిర్దేశించుకున్నట్లు చెప్పారు సీఎం. ఆధునిక సాంకేతికతకు చిరునామాగా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

వందేళ్ల తర్వాత టెక్నాలజీలో ఎవరూ అందుకోలేని భవిష్యత్ నగరంగా రాజధాని అమరావతి ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో అమరావతిలో మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. హైదరాబాద్ ఏవిధంగా అభివృద్ధి జరిగిందో ఇంకా కొత్త తరహాలో రాజధానిని అభివృద్ధి చేస్తామన్నారు. తాను ఈసారి ఏమరు పాటుగా లేనని.. మళ్లీ తమ ప్రభుత్వం వచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాను చెప్పారు చంద్రబాబు. పెట్టుబడిదారులకు హామీ ఇస్తున్నా ఆభూతాన్ని మళ్లీ రాకుండా చూసుకుంటామన్నారు సీఎం. ఏపీకి తాను సాధించిన బ్రాండ్‌ను గత సర్కార్ ధ్వంసం చేసిందన్నారు. మళ్లీ ఆ భూతం వస్తే పరిస్థితి ఏంటని కొంతమంది తనను అడుగుతున్నారు.. అది మళ్లీ




రాదని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తనదీ హామీ అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పెట్టుబడిదారులకు గత ప్రభుత్వ పాలన ఓ చీకటి అధ్యాయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆ ఐదేళ్ల పాలన గురించి ఆలోచించవద్దని పరోక్షంగా వైసీపీపై విమర్శలు చేశారు.

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతోంది కాబట్టే దేశం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందన్నారు సీఎం చంద్రబాబు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నామని చెప్పారు. ఆర్థిక అసమానతలు తొలగించేందుకు పారిశ్రామికవేత్తలు, ధనవంతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మిలియన్, ట్రిలియన్ డాలర్ల ఆస్తిపరులు ఓవైపు, పూట గడవని పేదలు మరోవైపు. ఈ అసమానతలు తొలిగేలా పని చేస్తున్నామన్నారు. సమాజానికి సేవ చేసే సమయమిది. పారిశ్రామిక వేత్తల సదస్సులో అసమానతలను రూపు మాపాలని పిలుపునిచ్చారు చంద్రబాబు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెడితే అధిక ప్రొత్సాహకాలిస్తామని హామీ ఇచ్చారు ముఖ్యమంత్రి చంద్రబాబు. సమాజంలో ఆర్థిక అసమానతలు పోయేలా చేయడమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత.. ఆ అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వం వారధిలా వ్యవహరిస్తోందన్నారు. వీటిని రూపుమాపేందుకు ప్రభుత్వం పీ4 విధానాన్ని ప్రమోట్ చేస్తోందని చెప్పారు. పాలసీ మేకర్గా పేదరికం లేని సమాజాన్ని భావితరాలకు అందించడం తన బాధ్యత. దీనికి పారిశ్రామికవేత్తలంతా సహకరించాలని చంద్రబాబు కోరారు.



## జగన్ క్వాష్ పిటిషన్‌పై ఉత్కంఠ

మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. సింగయ్య మృతి కేసులో హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు జగన్. ఈకేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని.. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు జగన్. పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు.. ఇవాళ విచారణ జరుపుతామని తెలిపింది.

...3వ పేజీలో



## కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశం అయింది. కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పటి ఘటనలను గుర్తు చేసుకుంటూ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

...4వ పేజీలో

# నీ ఆటలు సాగవు..
# పవన్‌కు కట్టప్ప కౌంటర్

**టీపీఎన్, చెన్నై :**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తమిళ నడుటు సత్యరాజ్ మాస్ వార్నింగ్ ఇచ్చాడు. దేవుడి పేరుతో తమిళనాడులో రాజకీయాలు చేస్తే ..తాట తీస్తామని హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో పవన్ పై సత్యరాజ్ చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి. ఇంతకీ పవర్ స్టార్, సత్యరాజ్ కు మధ్య ఏమైనా విభేదాలు ఉన్నాయా అనే అనుమానాలు వస్తున్నాయి. సినిమాలు వేరు..రాజకీయాలు వేరు అంటున్నారు పలువురు రాజకీయ విశ్లేషకులు.

త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎలాగైన గెలవాలని భావిస్తోంది. ఏపీలో మాదిరిగానే తమిళనాట పవన్ తో ఎన్నికల ప్రచారం చేయించాలని నిశ్చయించింది. పవన్ కు భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. వాటిని ఓట్లుగా మల్చుకోవాలని ఆరాట పడుతోంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పవన్ ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లోని అభ్యర్థులు అఖండ విజయం సాధించారు. కాటమరాయుడు ఇప్పుడు సౌత్ క్రౌడ్ పుల్లర్ లీడర్ కూడా. ఆయనకు దక్షిణాదిలో మంచి పేరు ఉంది. అందుకే చాలా మంది పవన్ అంటే చాలా మంది యువత ఇష్టపడతారు. వాళ్లందరినీ బీజేపీ వైపు తిప్పుకునేలా ప్లాన్ చేస్తున్నారు. అందుకే ఎన్నికలకు ముందే పవన్‌ను రంగంలోకి దింపారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్న కాషాయ దళం..ఇప్పుడు పవన్ రూపంలో ఓట్లు దండుకోవాలని పెద్ద పథకమే వేసినట్టు తెలుస్తోంది. ఇటీవల తమిళనాడులోని మధురైలో జరిగిన మురుగన్ మానాడు సభలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో..

...2వ పేజీలో





# ఆర్కేనా మజాకా!

### ఆయన కనుసనల్లోనే ఇసుక మాఫియా
### అప్పుడు వైసీపీలో.. ఇప్పుడు టీడీపీలో
### ధవళేశ్వరం, కాతేరు పడవ ర్యాంపులపైనా పెత్తనం
### డ్రెడ్జింగ్ బోట్లు సీజ్ చేసినా లెక్కచేయని ఇసుక మాఫియా

**సీహెచ్. శ్రీ, టీపీఎన్ రాజమండ్రి :**

జీవనది గోదావరి.. ఇసుక మాఫియా చేతులో నిర్జీవంగా మారుతోంది. సుప్రీంకోర్టు తీర్పు పట్టించుకోరు.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు చేస్తారు. ఇష్టారాజ్యంగా యంత్రాలతో తవ్వేస్తారు. గోదావరి నదీగర్భాన్ని విచ్చిన్నం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రజా ప్రతినిధులుగానీ, అధికారులు కానీ పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. గుంటూరుకు చెందిన ఆర్కే (రామకృష్ణ) అనే వ్యక్తి తూర్పుగోదావరి జిల్లాలో ఇసుక మాఫియాకు డాన్‌గా తయారయ్యాడనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కూటమి

...2వ పేజీలో



## శుభాంశు శుక్లా రోదసీ పయనం

భారత అంతరిక్ష యాత్రల చరిత్రలో మరో మైలురాయి ఆవిష్కృతమైంది. 41 ఏళ్ల తర్వాత భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్రకు బయల్దేరారు. భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా యాక్సియం4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా పయనమయ్యారు.

...2వ పేజీలో

# జిందాల్ నిర్వాసిత రైతుల ఆందోళన బాట!




### 2007లో జిందాల్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణ
### 17 ఏళ్లు గడుస్తున్నా కంపెనీ పెట్టని వైనం
### రైతుల భూములు వేరే కంపెనీలకు కేటాయింపు..?
### భూములిచ్చిన రైతుల నిరసన దీక్షలు
### నిర్వాసితుల్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే లలిత కుమారి హామీ

**నరసింహులు, టీపీఎన్, విజయనగరం :**

శృంగవరపుకోట మండల పరిధిలోని కిల్తంపాలెం, చీడిపాలెం, పెదఖండేపల్లి, మూల బొడ్డవర గ్రామాల పరిసర జిందాల్ అల్యూమినియం ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 1.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో జిందాల్ కర్మాగారం కోసం 1048.65 సెంట్ల భూమిని సేకరించింది. ఐతే.. భూ సేకరణ చేసి నేటికి 17 ఏళ్లు గడిచినప్పటికీ కంపెనీ పెట్టకపోగా.. కనీసం రైతులకు ఇచ్చిన హామీలు కూడా ఏవీ నెరవేర్చలేదు. అయితే తాజాగా జిందాల్ కంపెనీ కోసం సేకరించిన భూములను వేరే కంపెనీలకు కేటాయిస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో జిందాల్ కంపెనీ వస్తే తమ పిల్లలకు ఉద్యోగాలు వచ్చి తమ కుటుంబాలు బాగుపడతాయని భావించి నాడు భూములు ఇస్తే.. నేటి వరకు కంపెనీ పెట్టకుండా కనీసం తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఆ భూములను వేరే కంపెనీలకు దారాదత్తంగా ఇచ్చేస్తే తమ పరిస్థితి ఏంటని భూములిచ్చిన రైతులు ఆందోళనలు చేపట్టారు. రైతులు చేస్తున్న ఆందోళనల్ని యాజమాన్యం పట్టించుకోకపోవడంతో టు జిల్లా యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో గత కొన్ని రోజులుగా రైతులు

...2వ పేజీలో

# నీ ఆటలు సాగవు.. పవన్ కు కట్టప్ప కౌంటర్

**మొదటిపేజీ తరువాయి**

ఆయన.. నాస్తికులు, సెక్యులరిస్టులు అంటూ చేసిన కామెంట్స్ పెనుదుమారం రాజేశాయి. దీనిపై నటుడు సత్యరాజ్ సీరియస్ అయ్యారు.తమిళ ప్రజలు అంతా గమనిస్తున్నారని.. దేవుడి పేరుతో రాజకీయాలు చేసి, ఓట్లు దండుకొవాలని ప్లాన్ లు వేస్తే జరగదని కౌంటర్ లు వేశారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ మరోసారి సనాతన ధర్మం అంటూ కూడా చాలా ఎమోషనల్ గా మాట్లాడారు. అధికార డీఎంకే పార్టీని విమర్శించడంతో పాటు, హిందువులు, సనాతన ధర్మం అంటూ తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు.

నాస్తికులకు ఏ దేవుడినీ నమ్మాల్సిన ఏమిటంటే నాస్తికులు హిందువులను ఎంచుకుని టార్గెట్ చేసుకుంటున్నారని పవన్ వివాదాస్పద కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో దీనిపై సత్యరాజ్ పవన్ కు స్ట్రాంగ్ గా కౌంటర్ ఇచ్చారు. పెరియార్ సిద్ధాంతాలను నమ్మిన తమిళ ప్రజలను ఎవరు మోసం చేయలేరన్నారు.

మురుగన్ సభతో తమిళ ప్రజల్నిమోసం చేశామని అనుకుంటే అది పవన్ వెర్రితనం అవుతుందని సత్యరాజ్ పంచ్ లు వేశారు. తమిళ ప్రజలు చాలా తెలివైనవారు. తమిళనాట బీజేపీ ఆటలు సాగవంటూ కూడా సత్యరాజ్ హెచ్చరించారు. దేవుడి పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తే ఇక్కడి ప్రజలు గట్టిగా తిప్పికొడతారని పవన్ కు ..




# జిందాల్ నిర్వాసిత రైతుల ఆందోళన బాట!

**మొదటిపేజీ తరువాయి**

నిరసన దీక్షలు చేపట్టారు. 2007లో జిందాల్ అల్యూమినియం ఫ్యాక్టరీ కోసం అతి తక్కువ ధరకు భూములు ఇచ్చామని.. పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తామని, కంపెనీలో షేర్లు ఇస్తామని నాడు యాజమాన్యం రైతులకు హామీనిచ్చి భూములు తీసుకోవడం జరిగింది. రైతుల వద్ద నుండి భూములను తీసుకుని 17 సంవత్సరాల గడిచినా ఇప్పటివరకు ఎటువంటి ఫ్యాక్టరీ పెట్టకుండా జిందాల్ యాజమాన్యం తమను నమ్మించి మోసం చేసిందని భూములిచ్చిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాడు తమ వద్ద నుండి తక్కువ ధరకు తీసుకున్న భూములను ప్రైవేట్ వ్యక్తులకు అధిక ధరకు అమ్ముకోవడంపై రైతులు అభ్యత్యరం తెలుపుతున్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, భూమి ఇచ్చిన తమకు న్యాయం జరిగేలా చూడాలని, లేదా జిందాల్ యాజమాన్యంకు తాము ఇచ్చిన భూములను తిరిగి తమకు ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాగైనా ప్రభుత్వం జిందాల్ కంపెనీ నుంచి భూములను స్వాధీనం చేసుకుని తమకుఉ న్యాయం చేయాలని.. నిరుద్యోగులుగా మిగిలిపోయిన తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**జిందాల్ నిర్వాసిత రైతులకు న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి**

జిందాల్ కంపెనీకి భూమిలిచ్చిన భూనిర్వాసితులందరికి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హామీ ఇచ్చారు. త్వరలోచనే గ్రామాల్లో అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా నిజమైన భూ నిర్వాసితులను గుర్తించి వారందరినీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు. తమ ప్రాంతానికి కంపెనీలు వస్తే పిల్లల భవిష్యత్తు బాగుపడుతుందని.. అందుకుగాను అందరూ సహకరించాలని రైతులను ఆమె కోరారు.



# ఆప్కాస్ వ్యవస్థ ప్రక్షాళనపై యాక్షన్ ప్లాన్!

- **న్యాయ వివాదాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశం**
- **ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామక వ్యవస్థపై మంత్రుల బృందం సమీక్ష**
- **పూర్తి అధ్యయనం తర్వాత వారంలో మరోసారి భేటీ కావాలని నిర్ణయం!**

**టీపీఎన్, అమరావతిః**

ఆప్కాస్ వ్యవస్థపై పూర్తి యాక్షన్ ప్లాన్ను సిద్ధం చేయాలని ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామక వ్యవస్థపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. ఈ మేరకు సచివాలయం నాలుగు బ్లాక్ లోని విద్యాశాఖ చాంబర్ లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, పురపాలక శాఖ మంత్రి నారాయణతో కూడిన మంత్రుల బృందం అధికారులతో మొదటిసారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆప్కాస్ వ్యవస్థ గురించి సమగ్ర సమాచారాన్ని అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 1,07,082 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని అధికారులు తెలిపారు. శాఖల వారీగా ఉద్యోగుల వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మొత్తం ఉద్యోగుల్లో అత్యధికంగా స్వీపర్లు, పబ్లిక్ హెల్త్ వర్కర్లు 28.89శాతం, అటెండర్లు 9.64శాతం, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 9.10శాతం మంది ఉన్నారు. 2020 నుంచి చేపట్టిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలపై అధికారులను మంత్రుల బృందం ఆరాతీసింది. న్యాయవివాదాలను పరిశీలించాలని, ఆప్కాస్ వ్యవస్థ ప్రక్షాళనపై పూర్తి యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలని మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. పూర్తి అధ్యయనం తర్వాత మరోసారి భేటీ కావాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, ఎంఏయూడీ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి డి.రోనాల్డ్ రోస్, సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ, ఆప్కోస్ ఎండీ జి.వాసుదేవ రావు తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం ఎమ్మెల్యే కొడుకు... గంటా అల్లుడు కోసం తెలంగాణ నార్కోటీమ్ వెతుకుతోందా?

- **క్రికెట్ ఫ్రాంచైజీల వివాదంతో తెరపైకి ప్రశాంత్**
- **పేకాట, వైన్స్ బిజినెస్‌లో వినిపించిన ప్రశాంత్ పేరు**
- **కొత్తగా డ్రగ్స్ కూడా తీసుకుంటారంటూ ప్రచారం..?**
- **డ్రగ్ అడిక్ట్ ఏసీఏకి వైస్ ప్రెసిడెంట్‌గా ఎలా ఉంటారు..?**
- **డ్రగ్స్ తీసుకున్నట్లు రుజువైతే ప్రశాంత్‌కు ట్రబుల్సే..!**



**టీపీఎన్, అమరావతి :**

అవుననే అంటున్నారు అధికారులు. భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు కుమారుడు ప్రశాంత్ ఈ మధ్యే క్రికెట్ ఫ్రాంచైజీల వివాదంలో వార్తల్లోకెక్కారు. అలాగే భీమవరం నియోజకవర్గంలో నడుస్తున్న పేకాట వ్యవహారాల్లోనూ, వైన్స్ బిజినెస్ లోనూ ఆయన పేరు వచ్చింది. భీమవరానికి అసలు ఎమ్మెల్యే అన్నంతగా వ్యవహారాలు నడుస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇంతకీ ఆయనైతే భీమవరంలో పెద్దగా ఉండరు.. పుట్టిల్లు భీమవరం.. అత్తగారిల్లు వైజాగ్.. ఈ రెండిటి కన్నా బాస్ ఉండేది హైదరాబాద్ లోనే ఎక్కువ అంటున్నారు. ఒకవేళ భీమవరం వచ్చినా ఇంటికి కూడా వెళ్లకుండా ఫార్ట్యూన్ హోటల్ లో 8888 నెంబర్ సూట్ లోనే ఫ్రెండ్స్ తో కాలక్షేపం చేస్తారంట.

అయితే ఇప్పుడు వచ్చిన కొత్త విషయం ఏంటంటే... ఆయన డ్రగ్స్ వాడతారని. ఆయనకు డ్రింకింగ్, పేకాట లాంటివి బాగా అలవాటని.. అయితే అవన్నీ ఈ రోజుల్లో సామాన్యులకు కూడా కామన్ అయిపోయిందనే మాట లోకల్ గా వినపడుతోంది. కాని డ్రగ్స్ సంగతి ఎవరికీ తెలియదు.. ఎవరూ అనలేదు. కేవలం హైదరాబాద్ లోని నార్కోటిక్ టీమ్ దగ్గర మాత్రమే ఆ మాట వచ్చింది.

ఎందుకంటే ఈ మధ్య డ్రగ్స్ సప్లయ్ చేస్తున్న కొన్ని ముఠాలను నార్కోటిక్ వారు, టాస్క్ ఫోర్స్ వారు పట్టుకున్నారు. వారి నుంచి కస్టమర్స్ డేటా మొత్తం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా వారు ఏయే సెంటర్లకు, ఎవరెవరికి సప్లయ్ చేస్తున్నది పేర్లు మొత్తం లాగారు.ఆ పేర్లలో ప్రశాంత్ పేరు ఉన్నదనేది ఇప్పుడు వినపడుతున్న టాక్. ఆయన కోసం నార్కోటిక్ టీమ్ వెతుకుతుండటం.. ఆయన హైదరాబాద్ లో ఇంటి దగ్గర లేకపోవడం నిజమే అంటున్నారు.

ప్రస్తుతం ఆయన ఫోన్ అవైలబులిటీలో లేరని.. ఎక్కడున్నారో తెలియదు అంటున్నారు. అయితే ఆయన విదేశాలకు వెళ్లి ఉండొచ్చని.. ఎందుకంటే ఆయన మొబైల్ లాస్ట్ లొకేషన్ శంషాబాద్ ఎయిర్ పోర్టు చూపించిందని ఓ అధికారి చెప్పారు. అయితే ఇంకా ఆయనపై ఏవీ ప్రూవ్ కానందున.. ఇతర వివరాలు చెక్ చేయలేదని అన్నారు. కన్ ఫర్మ్ కాదు గాని.. ఆయన డ్రగ్స్ వాడుతున్నట్లు అనుమానాలు అయితే వచ్చాయి. పెద్ద సమస్య ఇప్పుడే వస్తుంది. ఒకవేళ ఆయన డ్రగ్స్ వాడుతున్నది నిజమే అయితే.. ప్రూవ్ అయితే.. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కు పెద్ద ట్రబులే రావొచ్చు. ఒక డ్రగ్ అడిక్ట్ క్రికెట్ అసోసియేషన్ కు వైస్ ప్రెసిడెంట్ గా ఎలా ఉంటారనే ప్రశ్న వస్తుంది. అసలే క్రికెట్ ప్లేయర్స్ మీద పూర్తిగా నిఘా పెట్టి.. వారు డ్రగ్స్ వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటున్న పరిస్థితుల్లో .. ఆయనపైనే ఆరోపణలు వస్తే ఆయన క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటుగా కొనసాగగలరా? అనేది ప్రశ్న.

అయితే ఇవన్నీ ట్రాష్ అని.. ఆయన ఎక్కడికో బిజినెస్ పర్పస్ మీద బయటికెళ్లి ఉంటారని ప్రశాంత్ సన్నిహితులు, అభిమానులు అంటున్నారు. భీమవరంలో ఎన్ని ఆరోపణలున్నా... ప్రశాంత్ వల్ల అక్కడి స్థానికుల సమస్యలు తీరుతున్నాయని.. ఏ ఇష్యూ మీద వెళ్లినా సాల్వ్ చేస్తున్నారని వారంటున్నారు. ఇక పోస్టింగులు, ట్రాన్స్‌ఫర్లు, కాంట్రాక్టులకు కలెక్షన్ అనేది ఏ ఎమ్మెల్యే అయినా చేసే పనే అని.. అది కామన్.. దానిని పట్టించుకోనవసరం లేదంటున్నారు.

ప్రశాంత్ పేరు అనేక కంపెనీల్లో డైరెక్టర్ గా ఉంది. కొన్ని యాక్టివ్ గా ఉంటే.. కొన్ని పేరుకే ఉన్నట్లు కనపడుతున్నాయి. ఆయనతో పాటు కొందరు రాజులు కలిసి కంపెనీలు నడుపుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. భీమవరంలో గాని, హైదరాబాద్ లో గాని ఆయన ఫ్రెండ్ సర్కిల్ కూడా వారే కాబట్టి.. అది సహజం అంటున్నారు. విచిత్రం ఏంటంటే.. ప్రశాంత్ కు ఏ సోషల్ మీడియా అకౌంట్ ఉన్నట్లుగా కనపడటం లేదు.

ఒకప్పుడు ఎమ్మెల్యే అంజిబాబు గౌరవంగా ఉండే వారని.. ఆయనకు దాదాపు వందల ఎకరాలు చెరువులున్నాయని.. అయితే గత ఎన్నికలప్పుడు కొన్ని కోట్లు అప్పు కాగా.. వాటిని కూడా తీర్చేశారని చెబుతున్నారు. భీమవరంలో ఎంత కలెక్షన్ చేసినా.. క్రికెట్ ఫ్రాంచైజీల వ్యవహారాలు నడిపేంతగా ప్రశాంత్ ఎదిగారంటే ఆయనకు ఎవరో సపోర్ట్ ఉందంటున్నారు. ఎంపీ సానా సతీష్, మామగారు గంటా శ్రీనివాసరావులే అయి ఉండాలని.. లేదా ఇంకెవరో ఉండుంటారని చెప్పుకుంటున్నారు.

ఏమైనా ఇప్పుడు డ్రగ్స్ వ్యవహారంలో ఆయన పేరు వినపడుతుండటం ఆందోళనకరమే. గతంలో డ్రగ్స్ సప్లయ్ చేసేవారిపైనే గట్టి సెక్షన్లతో చర్యలు తీసుకునేవారు.. ఇప్పుడు డ్రగ్స్ కొన్నా, వాడినా కూడా పెద్ద నేరమే. అందుకే ప్రశాంత్ ఇబ్బందుల్లో పడతారేమోనని అనుమానం. అయితే వాటికి కూడా బెయిల్ వస్తుందని.. పెద్దగా ప్రాబ్లెమ్ ఉండదంటున్నారు. కాని ఎటొచ్చీ క్రికెట్ అసోసియేషన్ లాంటి వ్యవహారాల్లో పార్టిసిపేట్ చేయడాన్ని మాత్రం అలాంటి కేసులు అడ్డుకుంటాయి. ఏమైనా ప్రశాంత్ ఈ డ్రగ్స్ వ్యవహారంలో క్లీన్ గా బయటికొస్తారని ఆశిద్దాం.

# అఖండ గోదావరి ప్రాజెక్ట్‌కు నేడే శంకుస్థాపన

- **నేడు రాజమండ్రిలో కేంద్రమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన**
- **ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి దుర్గేష్, స్థానిక ఎమ్మెల్యే**

**టీపీఎన్, రాజమండ్రి :**



అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు అభివృద్ధిలో భాగంగా హేవలాక్ వంతెన పునర్నిర్మాణం, ఆధ్యాత్మిక కేంద్రంగా పుష్కర్ ఘాట్ల అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. స్థానిక పుష్కర్ ఘాట్ దగ్గర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఉభయ గోదావరి జిల్లా ప్రజలు ఎంతో పోరాట పటిమతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు మంత్రి దుర్గేష్. కేవలం గోదావరి జిల్లాలకే కాక కడియం లంక, హెవలాక్ బ్రిడ్జి నిర్మాణాన్ని అనుసంధానిస్తూ బ్రిడ్జి లంక పైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు మంత్రి. కడియాపు లంక నర్సరీలను ప్రపంచ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చే విధంగా అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి డిపిఆర్ నివేదిక తయారు చేసుకొని కేంద్ర మంత్రివర్యులు గజేంద్ర సింగ్ షెకావత్ అనుమతితో సుమారు రూ.94 కోట్ల 44 లక్షల నిధుల అంచన వ్యయంతో అఖండ గోదావరి ప్రాజెక్ట్, గోదావరి పరివాహక ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుడటం జరిగిందని మంత్రి తెలిపారు. ఎంతోమంది ఆలోచనలు, ఆచరణలు అంది పుచ్చుకొని కార్యరూపం దాల్చిందని అన్నారు. జూన్ 26వ తేదీ అఖండ గోదావరి ప్రాజెక్ట్ కు కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందదరేశ్వరి ఆధ్వర్యంలో సంయుక్తంగా శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం బొమ్మూరు సెంటర్ నందు ఏర్పాటు చేసిన సైన్స్ మ్యూజియం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఫారెస్ట్ అకాడమీకి కూడా శంకుస్థాపన చేస్తారు. ఇది పూర్తిగా ప్రజల సంక్షేమ కార్యక్రమం అని ఆయన అన్నారు.

రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ గోదావరి జిల్లాల ప్రజల చిరకాల వాంఛ అయిన అఖండ గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు కూటమి ప్రభుత్వం ద్వారా సహకారం అవుతుందని తెలిపారు. హెవెలాక్ బ్రిడ్జి పునర్నిర్మాణం, పుష్కర గట్ల అభివృద్ధి అన్నిరాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి చేయడమే కాకుండా, భవిష్యత్తులో టూరిజం హబ్ గా రూపుదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, పూనుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇంత పెద్ద ప్రాజెక్టుని అమలు చేయటం గోదావరి జిల్లా ప్రజలకి ఎంతో ఆనందాన్ని ఇస్తున్న విషయం అన్నారు. టూరిజం హబ్ గా అభివృద్ధి అనంతరం అనేక ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ఆయన అన్నారు. పర్యటక రంగంలో తక్కువ పెట్టుబడి పెట్టడం ద్వారా ఎక్కువ ఆదాయం వస్తుందని, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఉభయగోదావరి జిల్లాలను అనుసంధానం చేసే నిర్మాణానికి పూనుకున్న రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి ఔన్నత్యానికి నిదర్శనమని ఎమ్మెల్యే వాసు అన్నారు. టెక్నాలజీ పరంగా అన్ని జాగ్రత్తలు తోనే ప్రాజెక్టు నిర్మాణం పటిష్టంగా పూర్తి చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. పాత్రికేయ మిత్రులు ఈ కార్యక్రమానికి హాజరై వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందిగా ఆయన కోరారు. నగరంలో మురికి నీరు కలుషితం కాకుండా అమృత సరోవర్ అనే పథకంతో మూడు కోట్ల రూపాయలతో ప్రాజెక్టు చేపట్టవలసిన ఆవశ్యకత ఉందని ఆయన అన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ఏర్పాట్లను మంత్రి కందుల దుర్గేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పీ డి నరసింహా కిషోర్, రెవెన్యూ, పోలీసు, ఆర్ ఎమ్ సి, పర్యాటక, తదితర శాఖల అధికారులతో కూడి పరిశీలించారు.

# ఆర్కేనా మజాకా!

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించి, ర్యాంపులకు అనుమతి ఇచ్చిన తొలి నుంచీ.. ఇక్కడి బోటు ర్యాంపుల్లో అక్రమాలు సాగుతున్నట్లు విమర్శలు వస్తూనే ఉన్నాయి. అదనపు వసూళ్లు, అనుమతులు లేకుండా తవ్వకాలు, అమ్మకాలు సాగుతూనే ఉన్నాయి. జూన్ నెలలో కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటి నుంచీ.. ఇక్కడ కొనసాగుతున్న రాంపుల్లో దళారీ నేతల సారథ్యంలో అక్రమ తవ్వకాలు, లావాదేవీలు జరుగుతూనే ఉన్నాయి. కూలీలు ఎక్కడా కనిపించడం లేదు. డ్రెడ్జింగ్ బోట్లతో గోదావరి నిండిపోతోంది. అయితే ఇక్కడ ఆర్కే అనే వ్యక్తి కనుసన్నల్లోనే ఇసుక మాఫియా కొనసాగుతున్నది అనేది బహిరంగ రహస్యం. వైసీపీ హయాంలో అప్పటి మంత్రి, ఇప్పటి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అలాగే అప్పటి చీఫ్ అడ్వైజర్ సజ్జల రామకృష్ణారెడ్డితో సంబంధాలు ఉన్నాయంటూ వారితో దిగిన ఫోటోలు చూపిస్తూ.. తూర్పులో ఇసుక మాఫియా నిర్వహించి కోట్లు గడించాడు. తిరిగి ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరితో చేతులు కలిపి అదే హవాను కొనసాగిస్తున్నాడు.



అప్పట్లో ఆర్కేని విమర్శించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు ఇప్పుడు నోరు మెదపకపోవడంపైన పలు విమర్శలు వినిపిస్తున్నాయి. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలోని ధవళేశ్వరం, కాతేరులోని సుమారు 12 ఇసుక ర్యాంపుల్లో అక్రమ ఇసుకను ఆర్కే అనధికార డ్రెడ్జింగ్ నిర్వహిస్తున్న వైనం వింటే ఎవరికైనా ఆశ్చర్యం వేయకతప్పదు. స్థానిక ప్రజాప్రతినిధులతో ఎటువంటి సంబంధాలు లేకుండా నేరుగా అధిష్టానం పెద్దలతో ఆర్థిక ఒప్పందాలు కుదుర్చుకుని యథేచ్ఛగా ఇసుక మాఫియాను నడుతున్న ఆర్కే తెగింపు చూస్తే అవాక్కవకమానరు. స్థానిక నేతలకు రోజూవారి, కొందరి నాయకులకు నెలవారీ మామూళ్లు సమర్పించుకుంటూ ఇసుక మాఫియా సామ్రాజ్యాన్ని ఏలుతున్నాడంటే ఆర్కే ఏ స్థాయిలో చక్రం తిప్పుతున్నాడోస్పష్టం అవుతుంది. రాజమండ్రి రూరల్, ధవళేశ్వరం, బుర్రిలంక, కాతేరు, తదితర ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా, నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్ జరుగుతోంది.

ప్రభుత్వ నిబంధనలతో పనిలేదు, గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు మాకు అవసరం లేదంటూ ఇక్కడ రాత్రి, పగలు తేడా లేకుండా.. దాదాపు 25 బోట్లతో నది గర్భంలో డ్రెడ్జింగ్ ఇంజన్లతో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నా జిల్లా స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ హయాంలో నదిలో ఇసుక తవ్వకాలు... అమ్మకాలు జేసీ సంస్థకు అప్పజెప్పింది. అయితే జేసీ సంస్థ ఇసుక ర్యాంపుల నిర్వహణను ఆర్కే అనే మరో సంస్థకు సబ్ లీజు ఇచ్చింది. ఈ రెండు సంస్థల ఆధ్వర్యంలోనే అడ్డగోలుగా గోదావరిలో డ్రెడ్జింగ్ ప్రక్రియపై ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటువంటి అనుమతులు లేకపోయినా ఇసుక దందా ఇంకా కొనసాగుతోంది.

**డ్రెడ్జింగ్‌తో గోదారికీ ముప్పు..!**

ఇసుక మాఫియాకు కోట్ల రూపాలను తెచ్చిపెట్టేవి డ్రెడ్జింగ్ బోట్సే. ఉదయం వేళల్లో సాధారణంగా ఇసుకను తవ్వే మాఫియా రాత్రి 7 గంటలు దాటితే చాలు ఇసుక రేవుల్లో డ్రెడ్జింగ్ బోట్స్ యథేచ్ఛగా తిప్పుతుంటారు. తెల్లవారు జాము 5 గంటల వరకూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వి తరలిస్తారు. డ్రెడ్జింగ్ బోట్స్ కారణంగా గోదావరిపై వంతెనలకు ముప్పు వాటిల్లుతుందని కలెక్టర్ ప్రకటించినప్పటికీ.. విజిలెన్స్, సెబ్ అధికారులు డ్రెడ్జింగ్‌ని ఆపే సాహసం చేయలేకపోతున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ఓపెన్ రీచ్‌ల కంటే బోట్‌స్‌మెన్ నిర్వహించే ఉమ్మడి ఇసుక ర్యాంపులే అధికంగా ఉన్నాయి. ఇరిగేషన్ ఉద్యోగుల్లో కూడా కొందరు ఈ డ్రెడ్జింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరిగేషన్ ఉద్యోగుల్లో కొందరు విజిలెన్స్ అధికారులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే అధికారులు చేపట్టే తూతూమంత్రపు తనిఖీల్లో డ్రెడ్జింగ్ బోట్లు కనిపించకుండా సాధారణ బోట్లను మాత్రమే చూపుతారు. పర్యావరణానికి తూట్లు పొడుస్తూ గోదావరి నదీ గర్భం నుండి భారీగా ఇసుకను తవ్వి తరలించే ఇసుక మాఫియా తప్పని సరిగా వినియోగించేది ఈ డ్రెడ్జింగ్ మిషన్లే. తూర్పుగోదావరి జిల్లాలో పలు చోట్ల సొసైటీ బోట్ రీచ్‌లను ఇటీవలే ఆర్డీవోలు, జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి డ్రెడ్జింగ్ మిషన్లను, లారీలను సీజ్ చేశారు. అలాగే పలు ర్యాంపులను కూడా నిలిపివేశారు. తదుపరి అనుమతులు ఇచ్చేవరకు ఓపెన్ రీచ్‌లు నిర్వహించరాదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ.. రాత్రి వేళల్లో పలు రాంపుల్లో అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో.. ఆర్డీవో ఆధ్వర్యంలో వరుస దాడులు జరిగాయి. వాహనాలు, యంత్రాలు సీజ్ చేసి, కేసులు కూడా నమోదు చేశారు. కలెక్టర్ ప్రశాంతి ప్రకటనతో మైన్స్, ఇరిగేషన్, పోలీస్, విజిలెన్స్ తదితర శాఖల అధికార బృందం ఆకస్మిక దాడులు నిర్వహించినా.. ఇసుక మాఫియా బరితెగించి నిర్వహిస్తుందంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



# మంత్రి లోకేష్ పర్యటనలో మహిళల నినాదాలు

**టీపీఎన్, మచిలీపట్నం:**

విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనలో గందరగోళం చోటుచేసుకుంది. మచిలీపట్నం మూడు స్తంభాల సెంటర్లో తల్లికి వందనం లబ్ధిదారులు ఉద్దేశించి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతున్న సమయంలో అక్కడకు చేరుకున్న కొంతమంది మహిళలు ఇల్లు ఇవ్వాలి అంటూ నినాదాలు చేశారు. ఇటీవల కాలంలో మూడో డివిజన్ కు చెందిన ఒక నిరుపేద మహిళ ఇల్లు కూల్చివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. మంత్రి నారా లోకేష్ వస్తున్నారని తెలుసుకున్న ఆమె మూడు స్తంభాల సెంటర్ కు చేరుకుంది. ఆమెతోపాటు ఇంకొంతమంది మహిళలు అక్కడకు చేరుకోని.. లోకేష్ మాట్లాడుతూ ఉండగా మున్సిపల్ అధికారులు అక్రమంగా కూల్చివేసిన ఇల్లుకు ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. అక్కడ ఆ మహిళల మాటలు వీడియోలో వినిపించాయి.



రేణిగుంటఅంతర్జాతీయ విమానాశ్రయానికి బుధవారం వచ్చిన పార్లమెంట్ సభ్యురాలు, కేరళ రాష్ట్రానికి పార్టీ కో - ఇంచార్జ్ శ్రీమతి అపరాజిత సారంగికి శ్రీకాళహస్తికి చెందిన కోలా ఆనంద్ ఘనంగా స్వాగతం పలికారు. దేశాన్ని చీకట్లోకి నెత్తివేసిన ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు" పూర్తయిన సందర్భంగా, తిరుపతిలో జరగనున్న మేధావుల సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. భారతీయ జనతా పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ కూడా స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.
- టీపీఎన్, శ్రీకాళహస్తి ..

## ప్రతిరోజు ప్రజలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్..

# పాలనలో సంస్కరణలు : లోకేష్

- జులై 2 నుంచి ప్రభుత్వ విజయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కేడర్‌కు పిలుపు
- తల్లికి వందనం, మెగా డీఎస్సీ హామీల అమలను ప్రస్తావించండి
- ప్రతిరోజు ఐదుగురు కార్యకర్తలతో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటానని వెల్లడి
- ధికారంలో ఉన్నా కష్టపడాలి.. అహంకారం ప్రదర్శించకూడదు

**టీపీఎన్, మచిలీపట్నం :**



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజలు తెలియచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు మంత్రి, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్. దీనికోసం జులై 2వ తేదీ నుంచి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలన్నారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు. ముందుగా మచిలీపట్నం వచ్చిన మంత్రి లోకేష్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డ ప్రతి కార్యకర్తను అధిష్టానం గుండెల్లో పెట్టుకొని చూసుకుంటోందని.. వారి సేవలను తప్పనిసరిగా గుర్తిస్తామని లోకేష్ పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. ఇక నుంచి పార్టీ అధినేత చంద్రబాబు, తాను ప్రతిరోజూ ఐదుగురు ప్రజలు, ఐదుగురు కార్యకర్తలతో నేరుగా మాట్లాడతామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు తీరును తెలుసుకుంటామన్నారు. అలాగే పార్టీ అంతర్గత సమస్యలపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామని లోకేష్ తెలిపారు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల కొన్ని సమస్యలు తలెత్తుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు లోకేష్. పార్టీ సంస్థాగత విషయాలు, సమస్యలపై చంద్రబాబుతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నట్లు చెప్పారు. పది నిర్ణయాల్లో ఒక తప్పు జరిగే అవకాశం ఉన్నందున వివిధ స్థాయిల్లోని నాయకుల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని సరిదిద్దుతామని స్పష్టం చేశారు నారా లోకేష్. మన టీడీపీ, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు చూపించిన ఉత్సాహాన్ని ప్రశంసించారు. కేడర్‌ను మరువకుండా చంద్రబాబు, తాను ప్రతి జిల్లాకు వెళ్లినప్పుడల్లా కార్యకర్తలను కలుస్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పర్యటించిన లోకేష్‌కు తల్లికి వందనం అమలు చేసినందుకు తల్లులు ధన్యవాదాలు తెలిపారు. పిల్లలను చదివించేందుకు ఏ తల్లీ ఇబ్బంది పడకూడదనే తల్లికి వందనం అమలు చేశామని లోకేష్ తెలిపారు. తనకు ధన్యవాదాలు తెలిపిన తల్లులందరికీ రుణపడి ఉంటానన్నారు.

**ఇంటింటికి వెళ్లండి.. ప్రభుత్వం ఏడాది పాలన విజయాలను తెలియజేయండి**

రెడ్‌బుక్ పేరు వింటే వైసీపీ నేతలకు గుండెపోటు వస్తోందని మంత్రి లోకేష్ ఎద్దేవా చేశారు. చట్టపరిధిలో రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుందని, తప్పుచేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వెంటిలేటర్ మీదున్న రాష్ట్రానికి ప్రధాని మోడీ అన్నివిధాలా సహకరిస్తూ ఆక్సిజన్ అందిస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్‌లో భాగంగా తల్లికి వందనం పథకం సక్సెస్ ఫుల్‌గా అమలు చేశామని చెప్పారు నారా లోకేష్. ఒకే జీఓతో రూ.8,745 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా.. చెప్పిన టైంకే తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలుచేశామని తెలిపారు. అలాగే మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టామన్నారు. పెద్దఎత్తున పరిశ్రమలను ఆకర్షించడం ద్వారా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషిచేస్తున్నామని వివరించారు. ఇప్పటికే దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా వృద్ధులకు రూ.4,000 పెన్షన్ అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇక సూపర్ సిక్స్‌లో భాగంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గత ప్రభుత్వం కక్షసాధింపులో భాగంగా నిలిపివేసిన బిల్లును 90 శాతం వరకు క్లియర్ చేశామని, మిగిలిన బిల్లులను కూడా జులైలోగా విడుదల చేస్తామని చెప్పారు. కార్యకర్తలపై గత ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల వంటి సమస్యలుంటే మంగళగిరిలోని కేంద్ర కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవచ్చని భరోసా ఇచ్చారు.

**గతంలో ఎన్నో అవమానాలు**

గత ప్రభుత్వం అమరావతి బిల్లు విషయంలో టీడీపీ ఎమ్మెల్సీలను కొనాలని చూసిందన్నారు. వాళ్లు మాత్రం చంద్రబాబుతోనే ఉంటామని చెప్పారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉండగా పార్టీ కార్యకర్తలు, నేతలపై అక్రమ కేసులు పెట్టి.. ఆర్థికంగా, శారీరకంగా నష్టపోయేలా చేశారన్నారు. చంద్రబాబు అభివృద్ధి చేసిన జైలులోనే ఆయన్ను పెట్టినప్పుడు తనకు చాలా బాధ కలిగిందన్నారు లోకేష్. జగన్‌పై ఎంత పోరాడానో.. పార్టీలో అంతకంటే మూడు రెట్లు పోరాడానన్నారు. కొన్ని విషయాల్లో విభేదించినా అంతిమ నిర్ణయం సీఎందే.. ఆయన ఆదేశిస్తే తల వంచుకొని అమలు చేస్తామన్నారు లోకేష్.

**ప్రజలతో పద్ధతిగా ప్రవర్తించండి**

వైసీపీ నేతలు అహంకారంతో వ్యవహరించడం వల్లే వారిని ప్రజలు ఘోరంగా ఓడించారని చెప్పారు నారా లోకేష్. 151 నుంచి 11కి తీసుకెళ్లారన్నారు. ప్రజలు అహంకారాన్ని, ఇగోలను ఏమాత్రం హర్షించరని పార్టీ శ్రేణులకు హితవు పలికారు లోకేష్. దాన్ని దృష్టిపెట్టుకొని ఏనాయకుడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఆ ప్రభావం పార్టీపై పడుతుందని చెప్పారు. అధికారంలో ఉన్నా కష్టపడాల్సిందే.. అహంకారంతో వ్యవహరించకూడదన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓర్పు, సహనంతో వారు చెప్పే సమస్యలను వింటూ వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఇక కూటమి నేతలతో సఖ్యతగా మెలగాలని పార్టీ శ్రేణులకు సూచించారు లోకేష్. రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ఏర్పడిందన్నారు. కూటమిలో మనది పెద్దన్న పాత్ర అని చెప్పారు. కూటమి నేతల మధ్య ఏవైనా సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకుంటూ సమన్వయంతో ముందుకు వెళ్లాలని కేడర్‌కి దిశానిర్దేశం చేశారు.



# గిరిజనులకు ఆగస్టు 15లోగా ఆధార్, రేషన్ కార్డులు

**టీపీఎన్, నెల్లూరు :**

జిల్లాలో ఆధార్, రేషన్ కార్డులు లేని గిరిజనులకు వచ్చే ఆగస్టు 15 లోపు వాటిని అందిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. బుధవారంనాడు ఆమె నెల్లూరు జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఇటీవల అమానుష దాడిలో గాయపడి కోలుకుంటున్న చిన్నారిని ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచెసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి సంధ్యారాణి మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు మూలాధారమని, మైదాన ప్రాంతమైన జిల్లాలో ఇప్పటికీ అమాయక గిరిజనులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేకపోవడం భాధాకరమన్నారు. వెంటనే ఆధార్, రేషన్ కార్డులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మారుమూల పల్లెల్లో త్రాగునీరు, సాగునీరు మౌలిక వసతుల కల్పనయే ఐటీడీఏల ప్రథమ కర్తవ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గిరిజన అభివృద్ధికి గత సంవత్సరం రూ.1300 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా 206 రోడ్లకు రూ.550 కోట్ల నిధులు వ్యయం చేశామన్నారు. నెల్లూరు ఐటీడీఏ పరిధిలోని కావలి ,తిరుపతి , కె.వి పల్లి తదితర ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలల అభివృద్ధికి దాదాపు రూ.18 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. గురుకుల పాఠశాలల్లోని 12 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు, ఏడుగురు ఐఐటీలలో సీట్లు సంపాదించడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలోని అన్ని గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో త్రాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. పేద గిరిజనులు వెనుకబడిన తెగలుగా మిగిలిపోకుండా వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించి పైకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ఆపేసినటువంటి 16 గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకొని యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**అంగన్వాడీలలో మేలైన పౌష్టికాహారం**

జిల్లాలోని ఐసిడిఎస్ ద్వారా 12 ప్రాజెక్టులు అమలవుతున్నాయని, 3000 అంగన్వాడి సెంటర్లలో బాలింతలకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సంక్షేమ పథకాలపై సమీక్షించామన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పౌష్టికాహార లోపం ఉన్న వారిని గుర్తించి వారికి సరైన పోషకాహారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం లక్ష రూపాయల నిధులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీలకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్రంలోని 6800 మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్చడంతో ప్రత్యేక టీచర్, ఆయాలను నియమిస్తున్నామన్నారు.

**మానవతా విలువలు మంటగలుస్తున్నాయి**

ఇటీవల జిల్లాలోని ఇందుకూరుపేట మండలంలోని ఓ గ్రామంలో అమానుష దాడికి గురై చికిత్స పొందుతున్న బాలికను మంత్రి పరామర్శించారు. రూ.50వేలు ఆర్థిక సహాయం అందించారు. చిన్నారి చదువుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, ఐటీడీఏ పిఓ మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

# జగన్ క్వాష్ పిటిషన్‌పై ఉత్కంఠ

- సింగయ్య మృతి కేసులో హైకోర్టును ఆశ్రయించిన మాజీ సీఎం
- కేసును కొట్టివేయాలంటూ హైకోర్టులో జగన్ క్వాష్ పిటిషన్
- మాజీ మంత్రుల పిటిషన్‌లతో కలిపి విచారించే అవకాశం

**టీపీఎన్, అమరావతి:**



మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. సింగయ్య మృతి కేసులో హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు జగన్. ఈకేసులో తనకు ఎలాంటి సంబంధం లేదని.. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు జగన్. పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు.. ఇవాళ విచారణ జరుపుతామని తెలిపింది. ఇవాల్టి హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది. ఇటీవల పల్నాడు జిల్లా రెంటపాళ్లలో ఉప సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్లారు. గుంటూరు జిల్లా ఏటుకూరు బైపాస్ ఆంజనేయస్వామి విగ్రహం దగ్గర జగన్ ప్రయాణిస్తున్న వాహనం కింద నలిగి సింగయ్య మృతి చెందాడు. ఈ ఘటనపై వీడియో పరిశీలించిన నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సింగయ్య మృతికి కారణమైన డ్రైవర్‌పై A1, జగన్ A2, మాజీ మంత్రులు పేర్ని నాని A5, విడదల రజిని A6, నిందితులుగా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇప్పటికే పేర్ని నాని, విడదల రజని హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిన్నింటిని కలిపి హైకోర్టు ఇవాళ విచారణ జరపనుంది. అయితే సింగయ్య మృతి కేసులో మాజీ సీఎం వైఎస్ జగన్‌కు పోలీసులు మంగళవారం నోటీసులు ఇచ్చారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో నల్లపాడు పోలీసుల నుంచి కార్యాలయ కార్యదర్శి అప్పిరెడ్డి నోటీసులు అందుకున్నారు. మరోవైపు సింగయ్య మృతికి కారణమైన జగన్ బులెట్ ప్రూఫ్ కారు ఏపీ 40 డీఎస్ 2349 నెంబర్ గల వాహనాన్ని నల్లపాడు పోలీసులు సీజ్ చేశారు.



# ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం : బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్

**టీపీఎన్, అమరావతి :**

మంత్రి నారాయణతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను యూకే ప్రతినిధులకు వివరించారు మంత్రి నారాయణ. అమరావతి ఆర్థికంగా వృద్ధి చెందేలా సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని వారి మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలో ఐకానిక్ భవనాల డిజైన్లు యూకేకు చెందిన నార్మన్ ఫాస్టర్ రూపొందించారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి అభివృద్ధికి ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని మంత్రి నారాయణకు బ్రిటిష్ డెప్యూటీ హై కమిషనర్ ఓవెన్ తెలిపారు. ప్రధానంగా డిజైన్, ఇంజనీరింగ్ సేవల్లో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపింది UK ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్పోర్ట్ గ్రూప్. ఇటీవల అమరావతిలో ప్రధాని మోడీ కార్యక్రమం బాగా జరిగిందని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ప్రశంసించారు. సీఎం చంద్రబాబు మంచి విజన్ ఉన్న నాయకుడని UK ప్రతినిధులు కొనియాడరు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్రిటన్ ప్రభుత్వం వ్యవహారాలు చూస్తున్నారు డిప్యూటీ హై కమిషనర్. ఈసమావేశంలో యూకే గ్రూప్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్పోర్ట్ చైర్ పర్సన్ పర్వీస్, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



# నింగిలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ 9 రాకెట్..
# అంతరిక్షంలోకి శుభాంశు శుక్లా

- **శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర ప్రారంభం**
- **ప్రయాణానికి ముందు ఫైటర్' సినిమాలో సాంగ్ విన్న శుక్లా**
- **రాష్ట్రపతి, ప్రధాని మోదీ శుభాకాంక్షలు**

**టీపీఎన్, అమరావతి :**

భారత అంతరిక్ష యాత్రల చరిత్రలో మరో మైలురాయి ఆవిష్కృతమైంది. 41 ఏళ్ల తర్వాత భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్రకు బయల్దేరారు. భారత వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా యాక్సియం4 మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి విజయవంతంగా పయనమయ్యారు. ఈ అంతర్జాతీయ బృందానికి ఆయన సారథ్యం వహిస్తున్నారు. యాక్సియం4 మిషన్‌లో భాగంగా మొత్తం నలుగురు వ్యోమగాములు కలిసి అంతరిక్ష యాత్రను చేపట్టారు. రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలో అడుగుపెట్టనున్న రెండో భారతీయుడిగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరనున్న తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డులకెక్కనున్నారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి బుధవారం మధ్యాహ్నం 12:01 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన నిమిషాలకే, వ్యోమగాములు ప్రయాణిస్తున్న వ్యోమనౌక రాకెట్ నుంచి విజయవంతంగా విడిపోయి, భూకక్ష్యలోకి ప్రవేశించింది. సుమారు 28 గంటల ప్రయాణం అనంతరం, గురువారం సాయంత్రం 4:30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) ఈ వ్యోమనౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం కానుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో శుభాంశు శుక్లా బృందం 14 రోజుల పాటు బస చేస్తుంది. ఈ సమయంలో వారు భారరహిత స్థితిలో పలు కీలక ప్రయోగాలు నిర్వహిస్తారు. అంతేకాకుండా, అంతరిక్షం నుంచే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో, పాఠశాల విద్యార్థులతో, ఇతర ప్రముఖులతో సంభాషించనున్నారు. ఈ యాత్ర ద్వారా అంతరిక్ష విజ్ఞాన రంగంలో మరిన్ని కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ చారిత్రాత్మక ప్రయోగం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ శుభాంశు శుక్లాకు, మిషన్ బృందానికి అభినందనలు తెలిపారు. భారత్ నుంచి గ్రూప్ కెప్టెన్‌గా వెళ్లిన శుభాంశు శుక్లా భారత అంతరిక్ష చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించారని చెప్పారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము. మీ ప్రయాణం పట్ల దేశం మొత్తం గర్వంగా, సంతోషంగా ఉందన్నారు. మీరు, యాక్సియం4 మిషన్‌లోని ఇతర దేశాల వ్యోమగాములు 'వసుధైక కుటుంబం' అనే భావనను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. నాసా, ఇస్రో మధ్య నెలకొన్న శాశ్వత భాగస్వామ్యానికి ఈ మిషన్ అద్దం పడుతోందని అన్నారు. ఈ యాత్ర సంపూర్ణంగా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు నిర్వహించే ప్రయోగాలు, శాస్త్రీయ అధ్యయనాలు భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అంతరిక్ష యాత్ర విజయంపై స్పందించారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. భారత్, హంగేరీ, పోలాండ్, అమెరికా దేశాలకు చెందిన వ్యోమగాములతో కూడిన ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారని ప్రధాని మోదీ అన్నారు. కోట్లాది మంది భారతీయుల కలలు, ఆశలు, ఆకాంక్షలను శుభాంశు తనతో పాటు మోసుకెళ్లారని ఆయన అభివర్ణించారు.

వ్యోమనౌకలోకి వెళ్లడానికి ముందు శుభాంశు తనకు ఎంతో ఇష్టమైన 'ఫైటర్' సినిమాలోని 'వందేమాతరం' అనే పాటను విన్నారు. ప్రయోగం అనంతరం ఫాల్కన్ 9 రాకెట్‌లోని వ్యోమనౌక నుంచి మాట్లాడారు. ప్రియమైన దేశ ప్రజలకు నమస్కారం.. 41 సంవత్సరాల తర్వాత మనం తిరిగి అంతరిక్షంలోకి వచ్చాం. ఇది అద్భుతమైన ప్రయాణం. సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతున్నాం. ఈ ప్రయాణం ఐఎస్ఎస్‌కి వెళ్లడానికి కాదు, భారత్ చేపడుతున్న మానవ అంతరిక్ష కార్యక్రమానికి పునాది అన్నారు శుక్లా. మీరందరూ ఈ ప్రయాణంలో భాగం కావాలని కోరుకుంటున్నానని చెప్పారు. తనతో పాటు మీరు కూడా గర్వంతో ఉప్పొంగాలన్నారు. భారతదేశ మానవ అంతరిక్ష కార్యక్రమాన్ని ప్రారంభిద్దాం. జై హింద్! జై భారత్!" అని చెప్పారు. ఫాల్కన్9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లగానే భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో యాక్సియం4 మిషన్ ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు శుభాంశు శుక్లా కుటుంబ సభ్యులు. ఫాల్కన్9 రాకెట్ అంతరిక్ష కేంద్రానికి విజయవంతంగా పయనమవ్వటంతో ఆనందంతో గంతులు వేశారు. తమ కుమారుడు అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లుతుండటం ఆనందంగా ఉందని శుభాంశు శుక్లా తండ్రి శంభు దయాల్ శుక్లా తెలిపారు. దేవుడి ఆశీర్వాదం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు.




# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

- **ఆగ్రాలో అంతర్జాతీయ బంగాళాదుంప పరిశోధనా కేంద్రం ఏర్పాటు**
- **పుణె మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం**

**టీపీఎన్, ఢిల్లీ:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశం అయింది. కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పటి ఘటనలను గుర్తు చేసుకుంటూ బాధితులకు నివాళిగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం అత్యవసర పరిస్థితిని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఈ ఏడాదితో సంవిధాన్ హత్యా దివాస్"కు 50 ఏళ్లు పూర్తయ్యాయని కేబినెట్ ఈ సందర్భంగా పేర్కొంది. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన వారి త్యాగాలను గౌరవించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో అంతర్జాతీయ బంగాళాదుంప కేంద్రం ఆధ్వర్యంలో దక్షిణాసియా ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆహారం, పోషకాహార భద్రత, రైతుల ఆదాయం, ఉపాధి కల్పనను పెంచడం దీని ప్రధాన ప్రధాన లక్ష్యం. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద బంగాళాదుంప ఉత్పత్తి చేస్తున్న దేశం భారత్ కాగా.. ఇందులో ఉత్తరప్రదేశ్ ముందువరుసలో ఉన్నది. పొటాటో సెంటర్ ఏర్పాటుతో బంగాళాదుంప ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, రవాణా, మార్కెటింగ్, విలువ గొలుసులో గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు సుమారు రూ.111.5 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. దీంతోపాటు, మహారాష్ట్రలోని పుణె మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణ పనులకు కూడా మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఈ విస్తరణ పనుల కోసం రూ.3,626 కోట్ల వ్యయాన్ని ఆమోదించింది. ఈ రెండు ఎలివేటెడ్ కారిడార్లు 12.75 కి.మీ. విస్తరించి ఉంటాయని.. 13 స్టేషన్లు ఉంటాయని తెలిపారు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్. చాందినీ చౌక్, బవ్ధాన్, కోత్రుడ్, ఖరడి, వాఘోలి వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలను కలుపుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును నాలుగు సంవత్సరాలలోపు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఝార్ఖండ్‌లోని ఝరియా బొగ్గు గనుల ప్రాంతంలో నిర్వాసితులైన కుటుంబాల పునరావాసం కోసం రూపొందించిన ఝరియా మాస్టర్ ప్లాన్‌కు కేంద్ర కేబినెట్ రూ.5,940 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో నిర్వాసిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడం, వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వడం, స్థిరమైన జీవనోపాధి మార్గాలను చూపించడం వంటి కార్యక్రమాలు చేపడతారు. అలాగే, యూపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. యూపీ గౌతమ్‌బుద్ధనగర్‌లో రూ.417కోట్లతో ఈఎంసీ క్లస్టర్ ఏర్పాటు చేయనున్నది కేంద్రం. భారత వ్యోమగామి శుభాంశు శుక్లా నేతృత్వంలోని బృందం విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశించడాన్ని స్వాగతిస్తూ కేంద్ర మంత్రివర్గం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. శుభాంశు శుక్లా 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలను మోసుకెళ్లారని కేబినెట్ ప్రశంసించింది. ఈ సందర్భంగా శుభాంశు శుక్లాతో పాటు ఇతర వ్యోమగాములకు అభినందనలు తెలియజేసింది.

# గండికోటలో ఒబెరాయ్ హోటల్....

- **హోటల్ నిర్మాణం.... రిసార్ట్ అభివృద్ధికి మంత్రి మండలి ఆమోదం**
- **హోటల్ ఏర్పాటుతో గండికోటలో పర్యాటకులకు మరిన్ని వసతులు...**
- **కేంద్రం సైతం అభివృద్ధికి సహకారం...**
- **త్వరలోనే గండికోటకు పూర్వానుభవం...**

టీపీఎన్, కడప : ప్రపంచ పర్యాటక రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక అభివృద్ధికి కొత్త హంగులు సమకూరనున్నాయి. ఏపీలోని ప్రముఖంగా సందర్శించే పర్యాటక ప్రాంతాల్లో కడప జిల్లా గండికోట ఉంది. జిల్లా జమ్మలమడుగు తాలూకాలో పెన్నా నది ఒడ్డున ఉన్న ఒక దుర్గం. ఎర్రమల పర్వత శ్రేణికి, పర్వత పాదంలో ప్రవహించే పెన్నా నదికి మధ్య ఏర్పడిన గండి మూలంగా ఈ కోటకు 'గండికోట' అనే పేరు వచ్చింది. దీనినే 'గండి కొండ' అని కూడా పిలుస్తారు. గండికోట ఇరుకు లోయల్లో నది వెడల్పు 300 అడుగులకు మించదు. ఇక్కడి లోయ యొక్క సుందర దృశ్యం వర్ణనాతీతం. ఎర్రటి గ్రానైట్ శిలలు, లోయలో నదీ ప్రవాహం, పక్షుల సవ్వడులు లోయ యొక్క అదనపు ఆకర్షణలు. ఇక్కడికి ఏపీతో పాటుగా తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక నుంచి సందర్శకులు వస్తుంటారు. ముఖ్యంగా వీకెండ్‌లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. చుట్టూ కొండలు.. పెన్నా నది అందాలు చూసి సందర్శకులు ఫిదా అవుతారు.

**గండికోటకు మహార్ధశ :**

కడప జిల్లాలోని గండికోటకు ఇప్పుడు మహార్ధశ రాబోతోంది. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు, హోటళ్ల నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. గండికోటను పర్యాటక రంగపరంగా అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. గండికోటలో ఒబెరాయ్ హోటల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయిస్తూ ఎపి క్యాబినెట్ అమోదం తెలిపింది. గత ప్రభుత్వ హాయంలోనే ఒబెరాయ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రతినిధులు సందర్శించారు. గండికోటలో నూతనంగా ఏర్పాటు చేయబోయే హోటల్ నిర్మాణానికి అప్పటి సిఎం వైఎస్ జగన్, ఒబెరాయ్ హోటల్స్ ప్రతినిధులు సీఈఓ అర్జున్ సింగ్ ఒబెరాయ్, రాజమాన్ శంకర్, వినోద్ గోస్వామి, సమూర్ నాయర్, మహినర్ తుఖర్ లు శంకుస్థాపన సైతం చేశారు. కానీ నిర్మాణం మాత్రం జరగలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి నిర్మాణానికి ఆసక్తి చూపింది. దీంతో స్పందించిన ప్రభుత్వం భూమిని కేటాయించింది. జమ్మలమడుగు మండలం దిగువపట్నంలో సర్వే నంబరు 1341, 135లో 50 ఎకరాలను ఆ సంస్థకు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రి మండలి మంగళవారం ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర పర్యాటక సంస్థ చేసిన ప్రతిపాదనను అంగీకరించింది. పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చేలా హోటల్స్‌లో 7 స్టార్ సౌకర్యాలతో విల్లా మోడల్ నిర్మాణం చేయనుంది.

**కేంద్రం సైతం సహకారం :**

కడప జిల్లాలోని "గండికోట ను ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కేంద్రం సైతం సహకారం అందిస్తోంది. కేంద్ర టూరిజం శాఖ సుమారు రూ. 78 కోట్ల నిధులను గండికోట అభివృద్ధి కోసం కేటాయింపు చేయనుంది.శ్రీకృష్ణదేవరాయలు 100 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని కూడా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు .

**కలిసొచ్చిన గండికోటలో వనరులు :**

ఒబెరాయ్ హోటల్స్ ఏర్పాటులో భాగంగా... ఆ సంస్థ చేపట్టే నిర్మాణాల వివరాలు, మౌలిక సదుపాయాలైన రోడ్లు, హెలిప్యాడ్, రిసార్ట్ భవనాలతో పాటు పర్యటకంలో ప్రత్యేక ఆకర్షణనిచ్చే వ్యూ పాయిట్స్, వివిధ రకాల క్రీడా ప్రాంగణాలు, జిమ్, స్విమ్మింగ్ పూల్, రెస్టారెంట్, చిల్డ్రన్ ప్లే జోన్, ల్యాండ్ స్కెపింగ్, లైటింగ్, సీటింగ్, లాంటి రిజర్వాయర్ లో వాటర్ జెట్టీలు, బోటింగ్ వంటి సదుపాయాల కల్పన కోసం రూపొందించింది. ఈ ప్రణాళికలతో ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తుండగా మరోవైపు ఒబెరాయ్ సంస్థ ఆతిధ్య సేవల కోసం సిద్ధమవుతోంది.

**ఉపాధికి ఊతం :**

ఇక్కడ ఒబరాయ్ హోటల్ రావడం వల్ల ఉద్యోగ అవకాశాలు పెరగనున్నాయి. ఈ హోటల్ వల్ల ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ దాదాపు 500 నుంచి 800 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఈ ఒబరాయ్ ప్రాజెక్టు అనేది ఇతర ప్రాజెక్టులు రావడానికి ఒక లంగరు వలె పని చేయనుంది. ఇతర ప్రాజెక్టులు వస్తే మరింత మందికి ఉపాధి లభిస్తుంది.



**అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు..!**

టీపీఎన్, ప్రకాశం / ఒంగోలు: జర్నలిస్టులకు మేలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు ఒంగోలులోని విష్ణు ప్రియ కన్వెన్షన్ హాలులో ఏపీ యూడబ్ల్యూజే జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర మహాసభల్లో మంత్రులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సమాజాన్ని చైతన్య పరుస్తూ అజ్ఞానం నుంచి ప్రజలను విజ్ఞానం వైపుకు తీసుకు వెళుతూ నిజాన్ని నిర్భయంగా తెలిపే జర్నలిస్టులకు మేలు చేసే విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రభుత్వం కల్పించే రాయితీని ఉపయోగించుకునే అక్రిడియేషన్ కార్డుల కోసం మంత్రుల కమిటీని నియమించామని తెలిపారు. హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించే అంశం పునః పరిశీలనలో పెట్టామన్నారు. అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. మీడియా సంస్థల మధ్య పోటీతో, వ్యక్తుల మెప్పు కోసం తప్పుడు వార్తలు ప్రచారం చేయడం సమాజానికి హానికరమన్నారు. అలాంటి తప్పుడు ప్రచారం చేయొద్దన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోనికి తెచ్చేది మీడియా నేనని సమస్య ఏదైనా ఎక్కడ ఉన్నా జర్నలిస్టులు వారి రాతలతో ప్రపంచానికి తెలియజేసే వ్యక్తులని కొనియాడారు. మీడియా సమాజ హితం కోసం పనిచేయాలని సమాజంలో ఉన్న అసమానతలు రూపుమాపడానికి, మూఢనమ్మకాలు, దురాచారాలను దూరం చేసే వార్తలు రాయాలన్నారు. నిజాన్ని నిర్భయంగా వార్తలుగా రాసే జర్నలిస్టులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని మంత్రి స్వామి భరోసానిచ్చారు.


# పర్యాటకంలో రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు..!

- **ఈనెల 26, 27 తేదీల్లో టెక్ కాన్‌క్లేవ్**
- **టూరిజం అవగాహన ఒప్పందాలకు పెద్దపీట**
- **ప్రపంచ పర్యాటకానికి గమ్యస్థానంగా ఏపీ**

**టీపీఎన్, విజయవాడ:**

గ్రీన్ మొబిలిటీ మరియు స్మార్ట్ టూరిజం మౌలిక సదుపాయాలకు ప్రధాన ప్రోత్సాహకంగా ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) జూన్ 26,27 తేదీలలో విజయవాడలో రెండు రోజుల టూరిజం టెక్ ఏఐ 2.0 కాన్క్లేవ్‌ను నిర్వహించనున్నట్లు ఏపీటీడీసీ, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ వెల్లడించారు. ఈ కాన్‌క్లేవ్ ద్వారా రాష్ట్రానికి వ్యూహాత్మక పెట్టుబడులను తీసుకురావడం ద్వారా ఇంధన సమర్ధవంతమైన, పర్యావరణ హితమైన అగ్రశ్రేణి పర్యాటకానికి ఏపీని గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందని తెలిపారు. ఇంధన సామర్థ్యం, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఆయన వివరిస్తూ ఏపీటీడీసీ జూన్ 27న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) అనుబంధ సంస్థగా ఉన్న కన్వర్జెన్స్ ఎనర్జీ సర్వీసెస్ లిమిటెడ్ (సీఈఎస్ఎల్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఒప్పందం రాష్ట్రంలోని పలు ప్రధాన నగరాలు, హైవే కారిడార్లు, పర్యాటక ప్రదేశాలలో ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్లు (ఈవీసీఎస్) ఏర్పాటు చేయడం తోపాటు బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్ల (బీఎస్ఎస్) ను కూడా ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో ఇండోస్విస్ బిల్డింగ్ టెక్నాలజీను విజయవంతంగా అమలు చేసిన తర్వాత ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఇది బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) చొరవతోనే సాధ్యమైనట్లు తెలిపారు. ఇళ్ల లోపల కనీసం 2 డిగ్రీల ఉష్ణోగ్రతను తగ్గించేందుకు దోహదపడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సమన్వయంతో ఇప్పటికే పెద్ద ఎత్తున పైలట్ ప్రాజెక్టులు అమలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి 20 శాతం వృద్ధి లక్ష్యాన్ని నిర్దేశించడంతో, రాబోయే నాలుగు సంవత్సరాలలో రూ. 25 వేల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించాలని తాము లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నామని వివరించారు. ఇంధనసమర్థవంతమైన పర్యాటక మౌలిక సదుపాయాల పరిచయంతోపాటు పెద్ద ఎత్తున ఈవీ విస్తరణ చేపట్టడానికి సీఎం మార్గదర్శకత్వం తమకు సహాయపడుతుందని చెప్పారు. మొత్తంగా బలమైన భాగస్వామ్యాలు, వాతావరణస్మార్ట్ విధానాలు, వ్యూహాత్మక ప్రోత్సాహకాలతో ఆంధ్రప్రదేశ్ తదుపరి తరం పర్యాటక అభివృద్ధికి స్థిరమైన, సమ్మిళిత, ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వానికి ఒక నమూనాగా తనను తాను నిలబెట్టుకుంటోందని ఆయన తెలిపారు.







## సూళ్లూరుపేటలో రోడ్లు పరిశీలన..!

**టీపీఎన్, సూళ్లూరుపేట :**

పట్టణంలోని రోడ్లపై ట్రాఫిక్ నిబంధనల అమలును పరిశీలిస్తూ, ట్రాఫిక్ నిలిపివేత సమస్యపై అవగాహన కల్పించేందుకు సబ్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మనాయుడు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఆయన బజారులోని వ్యాపారులు, వాహనదారులతో మాట్లాడారు. రహదారులపై అడ్డంకులు కలిగించకుండా, ట్రాఫిక్ సజావుగా సాగేందుకు సహకరించాల్సిన అవసరం ఉందని ప్రజలకు సూచించారు. విచ్చలవిడిగా వాహనాలు పార్క్ చేయడం లేదా రోడ్డు మీదకే వస్తువులు ఉంచి ఇబ్బందులు సృష్టించే వారికి కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీలలో భాగంగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన కొంతమంది వాహనదారులకు జరిమానాలు విధించారు. అనంతరం ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలకు కట్టుబడి ఉండాలని, పట్టణంలో క్షేమమైన రవాణా కోసం అధికారులకు సహకరించాలని ఎస్ఎచ్ఓ బ్రహ్మనాయుడు విజ్ఞప్తి చేశారు.



## కడపలో ఆకతాయిల ఆగడాలపై డ్రోన్ నిఘా..!

**టీపీఎన్, కడప :**

నగరంలోని కళాశాలలు, పాఠశాలల సమీపంలో ఆకతాయిల ఆటకట్టించేందుకు ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టారు. బుధవారం నుంచి ఎస్పీ ఆదేశాల మేరకు శక్తి టీమ్‌లు డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నాయి. శక్తి టీమ్‌ల ఆధ్వర్యంలో ఆయా కళాశాలలు, పాఠశాలల వద్ద బాలికలు, మహిళలకు భద్రతపై భరోసా కల్పిస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా మహిళలను వేధించే ఆకతాయిలను డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. మహిళల భద్రతతోపాటు శాంతి భద్రతలను కాపాడేందుకు కడప జిల్లా పోలీసులు నిరంతరం విజిలెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే ఎల్లమ రాజు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ ఈదురు బాషా, ఎస్ఐలు శ్రీనివాసులు, శాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభకు ప్రశంసా పత్రం..!

**టీపీఎన్, కాకినాడ :**



విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన కాకినాడ జిల్లా జగ్గంపేట ఎస్సై టీ రఘునాథరావును ఎస్పీ బిందు మాధవ్ అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి జాతీయ రహదారి మీదుగా అక్రమంగా గంజాయి రవాణా అడ్డుకట్ట వేసేందుకు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ చేపట్టిన చర్యల్లో భాగంగా ఇటీవల జగ్గంపేట సర్కిల్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో, గంజాయి రవాణా నిందితులను అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసే కేసుల్లో జగ్గంపేట ఎస్సై టీ రఘునాథరావు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో బుధవారం కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన క్రైమ్ మీటింగ్ అనంతరం ఎస్సై అభినందిస్తూ ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రఘునాథరావుకు పలువురు శుభాకాంక్షలు.

## కీచక అథ్లెటిక్స్ కోచ్ అరెస్ట్..!

**టీపీఎన్, ఏలూరు :**

స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) నిర్వహణలోని స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్ హాస్టల్‌లో అథ్లెటిక్స్ శిక్షణ పొందుతున్న 10వ తరగతి చదివే విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన కీచక కోచ్ దూలం నాగేంద్ర వెంకట వినాయక ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఏలూరులో శాయ్ హాస్టల్‌లో వినాయక ప్రసాద్ అథ్లెటిక్స్ శిక్షణ పొందుతున్న పదో తరగతి విద్యార్థినుల పట్ల అనుచితంగా మాట్లాడుతు, తాకరాని చోట తాకుతున్నాడంటూ శాయ్ బెంగళూరు సెంటర్‌కు ఫిర్యాదు వెళ్లింది. దీనిపై శాయ్ అధికారుల బృందం ఏలూరు చేరుకుని రహస్య విచారణ జరిపారు. వారి విచారణలో విద్యార్థినుల పట్ల కోచ్ వినాయక ప్రసాద్ చేస్తున్న వేధింపులు వాస్తవమేనని తేలింది. అనంతరం బాధిత విద్యార్థినులు ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కోచ్ వినాయక ప్రసాద్‌పై సెక్షన్ 75 బీఎన్ఎస్ 8 ఆఫ్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి మహిళా ఎస్సై కళ్యాణి విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా వినాయక ప్రసాద్ పరారీలో వున్నాడు. ఈ కేసును ఎస్పీ ప్రతిష్టాత్మకంగా తీసుకుని తక్షణ విచారణ జరిపి నిందితుడిని అరెస్ట్ చేయాలని ఆదేశించారు. దీంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ కే అశోక్ కుమార్, మహిళా ఎస్ఐ కల్యాణి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. అతడిని మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు టూటౌన్ పోలీసులు వెల్లడించారు. నిందితుడిని బుధవారం ఏలూరు కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి అతనికి 14రోజులు రిమాండ్ విధించారు.




# ఇరాన్‌పై అమెరికా దాడులు దుర్మార్గం..!

- **ఏలూరులో వామపక్షాల నిరసన**

టీపీఎన్, ఏలూరు : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం ఏలూరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అమెరికా యుద్ధోన్మాదం నశించాలి.. యుద్ధం వద్దు.. ప్రపంచ శాంతి కావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎమ్‌సీపీఐయూ జిల్లా కార్యదర్శి శ్రావణంపూడి నాగరాజు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మన సాంప్రదాయ విదేశాంగ విధానానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇరాన్‌పై దాడులతో ఆయిల్ సంక్షోభం వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివలన మన దేశ ప్రజలపై భారాలు పడతాయని చెప్పారు. భారత్‌కు ఇరాన్ ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతి కష్ట సమయంలోనూ భారత్‌కు మద్దతు ఇస్తోందన్నారు. ఇరాన్‌పై దాడి చేయడానికి అమెరికా కుంటిసాకులు చెబుతోందన్నారు. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తోందని తమ వద్ద నిర్దిష్ట ఆధారమేదీ లేదని అంగీకరించాయన్నారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై ఇరాన్ సంతకం చేసిందన్నారు. అయినప్పటికీ అమెరికా, ఇజ్రాయిల్ దాడులు చేయడం దుర్మార్గమన్నారు. అమెరికా ఇరాన్‌పై దాడి చేయడం పశ్చిమ ఆసియాపై పెత్తనం చెలాయించేందుకేనని, ప్రపంచాన్ని భయపెట్టేందుకేనని స్పష్టం అవుతుందన్నారు. అమెరికా దాడి ప్రపంచ వ్యాప్తంగా ఘర్షణలను తీవ్రతరం చేస్తుందని, ప్రపంచ శాంతి పైన, సాధారణ ప్రజల జీవనోపాధి మీద వినాశకరమైన ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా గాజాపై ఇజ్రాయిల్ దాడులను కూడా ఆపాలన్నారు. అమెరికా యుద్ధోన్మాదాన్ని అందరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచంపై అమెరికా ఆధిపత్య ధోరణి వ్యతిరేకించండి..!



- **కడపలో వామపక్ష పార్టీల నాయకుల నిరసన**

టీపీఎన్, కడప : ప్రపంచంపై అమెరికా ఆధిపత్య ధోరణి వ్యతిరేకించాలంటూ కడపలో వామపక్ష పార్టీల నాయకులు నిరసన చేపట్టారు. బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో సీపీఎం, సీపీఐ, భారత కమ్యూనిస్టు పార్టీ (లిబరేషన్), భారత కమ్యూనిస్టు పార్టీ (న్యూ డెమోక్రసీ), ఆర్‌సీపీ, ఆర్ఎమ్‌పీఐ, ఫార్వర్డ్ బ్లాక్ సంయుక్తంగా ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ... అమెరికా ప్రపంచంపై ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోందని, ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన 104 యుద్ధాలు అమెరికా ఆర్మీ మారణాయుధాల వ్యాపార లాభాల కోసం ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించినవేనని విమర్శించారు. ఒకవైపు ప్రపంచాన్ని ఉద్ధరించే వ్యాఖ్యలు చెబుతూ, మరోవైపు ప్రపంచంలో అనేక దేశాలలోని అత్యంత అరుదైన, విలువైన నిక్షేపాలను, గనులను, ఆయిల్‌ను, గ్యాస్‌ను దోపిడీ చేస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాదుల్లా మాట్లాడుతూ.. అమెరికా దుర్మార్గాలకు, ఇజ్రాయిల్ దురాక్రమణలకు హద్దూ పద్దూ లేకుండా పోయిందని.. వారిని ప్రశ్నించే దేశాలపై ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్నాయంటూ తప్పుడు నిందలు వేస్తున్నాయని మండిపడ్డారు. అణ్వాయుధాలు తయారీ చేస్తున్నారనే నెపం మోపి ఆ దేశాల ప్రజలను చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భౌగోళికంగా అక్కడ అభివృద్ధిని నాశనం చేస్తున్నారని వీరిపై ప్రపంచవ్యాప్తంగా ప్రజా నిరసనలు వస్తున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఓబయ్య, ఆర్ఎస్‌పీ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ రాము, ఆర్ఎంపీఐ జిల్లా కార్యదర్శి రమణయ్య, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు రామ్మోహన్, వామపక్ష ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రెస్, పోలీసు స్టిక్కర్ వేసుకున్న వాహనదారులపై స్పెషల్ డ్రైవ్..!

**టీపీఎన్, తిరుపతి :**

నగరంలో ప్రెస్, పోలీసు స్టిక్కర్ వేసుకున్న వాహనదారులపై ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణ చారి పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అనధికారికంగా కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రెస్, పోలీస్ స్టిక్కర్ వేసుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటిసారి తప్పుగా పరిగణనలోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇస్తామని.. మళ్లీ రిపీట్ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది వ్యక్తులు తాము జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై ప్రెస్, పోలీస్ అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఇక నుంచి ఎవరైనా ప్రెస్, పోలీసు స్టిక్కర్స్ తగిన గుర్తింపు కార్డులు లేకుండా వేసుకుని తిరిగే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా.. వారి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.






## నా బంధువే అన్యాయం చేశాడు : సినీ దర్శకుడు గీతాకృష్ణ

**టీపీఎన్, రాజమండ్రి :**

కడియం మండలం మాధవరాయుడు పాలెంలో తమ తాతల నుంచి వచ్చిన స్థలంలో తమ అనుమతి లేకుండా, కనీసం తమ దృష్టికి తీసుకురాకుండా సచివాలయమో, కమ్యూనిటీ హాలుకోసమో శంకుస్థాపన చేయించడం దారుణమని ప్రముఖ సినీ దర్శకుడు, ఫైర్ బ్రాండ్ యూట్యూబర్ అన్నందేవుల గీతాకృష్ణ వాపోయారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ అన్నందేవుల చంటి తమ బందువు అయినా అన్యాయం చేసారని ఆయన ఆరోపించారు. ఆలయ నిర్మాణం కోసం కొంత స్థలాన్ని పంచాయితీకి ఇవ్వాలని తమ పెద్దలు నిర్ణయించడంతో, సదరు స్థలాన్ని అలాగే ఉంచామన్నారు ... అయితే అది రిజస్టర్ చేయకుండానే వాళ్ళ ఇష్టారాజ్యంగా ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానించి శంకుస్థాపన చెయించడం దారుణమన్నారు. శంకుస్థాపన అయిన తరువాత ఊళ్ళో వాళ్ళు విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో కలెక్టర్, ఆర్డీవో ల కు పిర్యాదు చేసానని ఆయన తెలిపారు. గత కలెక్టర్ కి కూడా సదరు సర్పంచి తీరుపై పిర్యాదు చేసానని ఆయన చెప్పారు. సర్పంచి చంటి ఊళ్ళో చాలా దారుణాలు చేస్తూన్నాడని, నర్సరీ వ్యవసాయాన్ని ఇబ్బందులపాలు చేస్తూ మోనార్క్ లా ఉంటున్నాడని, ఎదురుతిరిగిన వాళ్ళను చెడ్డవాళ్లుగా చిత్రిస్తున్నాడని గీతాకృష్ణ అన్నారు. ఎన్నో వీడియోలు చేసి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన తాను ఇతడి వ్యవహారంపై కూడా తమ ఊరు చీడ పురుగు చంటి పేరుతొ ఓ వీడియో చేసానని ఆయన చెప్పారు. ఆ వీడియోను షేర్ చేసారు. ఇప్పటికైనా చంటి ఆగడాలను అడ్డుకట్టవేయాలని ఆయన కోరారు.



## ఆడారి కిషోర్ కుమార్‌కు పీహెచ్‌డీ ప్రధానం

**టీపీఎన్, విశాఖపట్నం :**

సమైక్యాంధ్ర ఉద్యమ జేఏసీ చైర్మన్, విద్యార్థి నాయకులు ఆడారి కిషోర్ కుమార్ కు ఆంధ్ర విశ్వవిద్యాలయం " ఉమన్ ఎంపవర్‌మెంట్ త్రూ కాన్‌స్టిట్యూషనల్ అండ్ అదర్ లాస్ ఏ సోషియో లీగల్ స్టడీ ఇన్ స్పెషల్ రెఫరెన్స్ టూ అనకాపల్లి డిస్ట్రిక్ట్ "అనే అంశం పైన చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీని ప్రధానం చేసింది. దామోదరం సంజీవయ్య నేషనల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ప్రకాష్ రావు మార్గదర్శనంలో కిషోర్ కుమార్ చేసిన ఈ పీహెచ్‌డీ డిగ్రీని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సులర్ ఆచార్య రాజశేఖర్ అందించారు. కార్యక్రమంలో ఆచార్య సీతామాణిక్యం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొని కిషోర్ కుమార్‌ని అభినందించారు. ఆడారి కిషోర్ కుమార్ సామాన్య మధ్యతరగతి కుటుంబంలో ఆడారి వరహా సత్య నాగభూషణరావు, మహాలక్ష్మమ్మ దంపతులకు అనకాపల్లిలో జన్మించారు. చిన్నతనం నుంచి సేవా కార్యక్రమాల వైపు ఆసక్తి పెంచుకున్న కిశోర్ కుమార్ వాటిలో పాల్గొంటూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థి నాయకుడిగా ఎదిగారు. అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఆ తర్వాత హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికై ఆయా విద్యాసంస్థలకు విశేషమైన సేవలను అందించారు. తదుపరి జరిగిన సమైక్యాంధ్ర ఉద్యమంలో ఉద్యమ నాయకుడిగా కిషోర్ కుమార్‌కు చక్కని గుర్తింపుని తీసుకొనివచ్చింది. సమైక్యాంధ్ర గురించి ఆయన చేసిన పోరాటం సామాజిక రాజకీయ నేతలను మేధావులను ఆశ్చర్యపరచడమే కాక వారి ప్రశంసలకు కారణమైంది. దీనితో పాటు వివిధ సేవా కార్యక్రమాలను కిషోర్ కుమార్ నిర్వహించారు. ముఖ్యంగా ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఆయన ఫ్యాప్టో నిర్వహించిన జాతాలో పాల్గొనడమే కాకుండా విశాఖ నగరానికి వైద్య అవసరాల కోసం వచ్చే ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయుల కోసం ఉచిత వసతి, అత్యవసరమైన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల ద్వారా అందించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని 400 రోజులు పాటు నిర్విరామంగా నిర్వహించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి ప్రశంసలను పొందారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌స్‌లో చోటు సంపాదించారు. గతంలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఆయన పోటీ చేశారు. కర్షక దేవోభవ అనే కార్యక్రమాన్ని చేపట్టి 50 రోజుల పాటు రైతులకు వివిధ అవగాహన సదస్సులను నిర్వహించారు. ప్రస్తుతం సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.



## బూరగడ్డ వేదవ్యాస్‌కి సముచిత స్థానం కల్పించాలి : జై కాపు సేన

**టీపీఎన్, విజయవాడ :**

ఉభయ తెలుగు రాష్ట్రాల డిప్యూటీ స్పీకర్ గా, కృష్ణ జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన, కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు విశేష కృషి చేసిన బూరగడ్డ వేదవ్యాసుకు గౌరవప్రదమైన రాష్ట్రస్థాయి పదవిని కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ జై కాపు సేన లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,డిప్యూటీ స్పీకర్ పవన్ కళ్యాణ్ ను కోరారు. బుధవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ నీతి నిజాయితీతో కూడిన రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన బూరగడ్డ వేదవ్యాసు తండ్రి బూరగడ్డ నిరంజన్ రావు శాసనసభ్యులుగా ప్రజల మనల్ని పొందాలని గుర్తు చేశారు. గత మల్లేశ్వరం నేడు పెడన నియోజకవర్గం శాసనసభ్యునిగా ఉభయ తెలుగు రాష్ట్రాల డిప్యూటీ స్పీకర్ గా నిజాయితీ కలిగిన రాజకీయ నాయకుడైన బూరగడ్డ వేదవ్యాస్‌కి రాష్ట్ర స్థాయిలో సముచిత స్థానం కల్పించాలని జై కాపుసేన డిమాండ్ చేస్తున్నట్లు బాలాజీ తెలియజేశారు. గత ఏడాది జరిగిన ఎన్నికలలో మచిలీపట్నం శాసనసభ్యులు కొల్లు రవీంద్రని పెడన శాసనసభ్యునిగా ఎన్నికైన కాగిత కృష్ణప్రసాద్ కు, పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాల సౌరీ కి మద్దతు పలికి వారి విజయానికి కృషి చేసిన వేదవ్యాసు కు ఎమ్మెల్సీ గాని లేదా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవి గాని అప్పగించాలని బాలాజీ కోరారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులుగా కూడా వేదవ్యాస్ అన్ని పదవులకు అర్హులేనని బాలాజీ అన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన సీనియర్ నాయకులను ఏడాది దాటిన గుర్తించకపోవడం అత్యంత బాధాకరమని బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాపు సంఘాలతోపాటు, ఇతర కులస్తులలో అభిమానులు కలిగిన వేదవ్యాస్ కు పదవి ఇవ్వటం ద్వారా కాపులకు గుర్తింపు ఇచ్చినట్లేనని బాలాజీ పేర్కొన్నారు. రాజకీయ అనుభవం విద్యావేత్త అయినా వేదవ్యాస్ సేవలు రాష్ట్రానికి అవసరమని బాలాజీ పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ కార్పొరేషన్ ఎన్నికలలో వేదవ్యాస్ పాత్ర ఎంతో కీలకమైందని బాలాజీ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి జై కాపుసేన అభ్యర్థనను పరిగణలకు తీసుకోవాలని బాలాజీ కోరారు. రాష్ట్రంలోని 13 జిల్లాలలో కాపు నాయకులకు పదవులు ఇవ్వాలని బాలాజీ డిమాండ్ చేశారు.




## మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి..!

**టీపీఎన్, పార్వతీపురం మన్యం జిల్లా :**


జిల్లాలోని మహిళల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. మత్స్య సంపద ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చని, ఇందుకు పీఎం మత్స్య సంపద యోజన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లో మిషన్ మత్స్యశక్తి, జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్, గిరి బజార్ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మిషన్ మత్స్య శక్తి ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు సహాయం అందించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచి, సమాజంలో సమాన భాగస్వాములుగా చేయడానికి ఉద్దేశించిన ఒక సమగ్ర కార్యక్రమమని కలక్టర్ వివరించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళలకు సూచించారు. జిల్లాలో మత్స్య సంపద ద్వారా ప్రస్తుతం రూ. 479 కోట్లుగా ఉన్న జీడీపీని రూ. 600 కోట్లకు పెరగాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మన్యం ప్రాంతం ఆశావాహ జిల్లా అని, ఇక్కడ కేంద్ర ప్రభుత్వం నిధులు ఎక్కువగా విడుదల అయ్యే అవకాశం ఉందని, ధర్తీ అభా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ ( డిఎ జుగా ) కింద గుర్తించిన 165 గిరిజన గ్రామాల నుంచి ప్రతిపాదనలు వెళ్లాలని అన్నారు. ఈ పథకం కింద 90 శాతం వరకు సబ్సిడీ పొందవచ్చని అన్నారు. ఈ నెల 30లోగా ప్రతిపాదనలు తమకు సమర్పించాలని కోరారు. మత్స్య సంపద పెరిగేలా అవసరమైన ట్యాంకులను గుర్తించి, కనీసం 100 ఫిష్ పాండ్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతీ పాండ్ లో కనీసం లక్ష ఫ్లింగరింగ్ చేప పిల్లలు ఉత్పత్తి కావాలని, జిల్లావ్యాప్తంగా 1 కోటి చేప పిల్లలు దిగుబడి రావాలని కలెక్టర్ ఉద్బోదించారు. ఫిష్ పాండ్స్ నిర్వహణను స్వయం సహాయక బృందాలకే అప్పగించాలని చెప్పారు. జిల్లాలో ఏర్పాటు కాబోతున్న జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులు సిద్ధం కావాలని ఐటీడిఎ పీఓను కలెక్టర్ ఆదేశించారు. యూనిట్ నిర్వహణలో భాగంగా సిబ్బందికి శిక్షణ తప్పనిసరని సూచించారు. స్వయంగా వీడీవీకె నిర్వహించుకునేంత వరకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. నాణ్యమైన జీడిపప్పును విక్రయించాలని, ఆకర్షనీయమైన ప్యాకింగ్ ఉండాలని అన్నారు. బ్యాచ్ నెం, తయారీ తేదీ, బార్ కోడ్, ధర తదితర వివరాలు ప్యాకింగ్ పై ఉండాలని స్పష్టం చేశారు. గ్రేడింగ్ అయిన తదుపరి వచ్చే జీడిపప్పును కూడా ఇతర ఆహార పదార్థాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. జీడిపప్పు అక్రమ రవాణా కాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. గిరి బజారు వాహనాలను అప్పగించ నున్నామని, వాటితో గిరిజన ప్రాంతాల్లో సరుకులను విక్రయించవచ్చని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే ప్రతి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యమని, ఆ దిశగా మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, ఏపీఓ ఎ.మురళీధర్, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, పార్వతీపురం మత్స్యకార అధికారి శ్రీదేవి, జిల్లా పశుసంవర్ధక అధికారి డా. ఎస్.మన్మధరావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, ఎల్డిఎం ఎన్.విజయ్ స్వరూప్, నాబార్డ్ ఏజీఎం దినేష్, కెవికె శాస్త్రవేత్త డా.శ్రీనివాస్ రాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థుల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు

**టీపీఎన్, ముసునూరు :**

ఏలూరు జిల్లా ముసునూరు మండలంలోని గుడిపాడు, వలసపల్లి, గొల్లపూడి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు చొరవతో ఈ సౌకర్యం ఆర్టీసీ కల్పించింది. విద్యార్థులు ఏలూరులో ఉన్న విద్యాసంస్థలకు వెళ్లేందుకు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఆధారపడుతుండటంతో తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థుల తరఫున పాఠశాల స్థల దాత రాయంకుల రామారావు ఆర్టీసీ చైర్మన్‌ను కలిసి తమ వినతిని తెలిపారు. దీనిపై ఆర్టీసీ జోనల్ చైర్మన్ అప్పలనాయుడు వెంటనే స్పందించి, ఏలూరు డిపో నుండి ధర్మాజీగూడెం మీదుగా వలసపల్లి, గుడిపాడు, చెక్కపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగబాబు మాట్లాడుతూ, "పాఠశాల స్థలదాత రామారావు గారి ప్రోత్సాహంతో, ఆర్టీసీ చైర్మన్ గారి సహకారంతో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయం. ఇది పలు గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎంతో ఉపయోగపడుతుంది" అని తెలిపారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కొత్త బస్సును ఘనంగా స్వాగతించారు. విద్యార్థుల విద్యా హక్కును గుర్తించి, సమయోచితంగా స్పందించిన ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.




# ఎమర్జెన్సీకి దారితీసిన పరిస్థితులు..!

జూన్ 25, 1975న భారతదేశంలో ఎమర్జెన్సీ విధించబడింది. ఈ సంవత్సరానికి యాభై ఏళ్ళు పూర్తయ్యాయి! నిజానికి 1962 నుండి 1968 వరకూ మన దేశంలో ఎమర్జెన్సీ విధించబడిన విషయం మనకెవ్వరికీ తెలీదు. చైనా యుద్ధం వల్ల ఆనాటి ప్రెసిడెంట్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశంలో అత్యున్నత పరిస్థితిని విధించారు. అలాగే 1971 నుండి 77 వరకు బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో వి.వి.గిరి గారు అత్యున్నత స్థితి విధించారు. అంటే ఇందిరాగాంధీ మొట్టమొదటి సారి ప్రమాణస్వీకారం చేసిన 1966లోనూ, రెండవసారి ప్రధానమైన 1971లోనూ మనదేశం అత్యవసర పరిస్థితుల్లోనే వుంది! అయితే ప్రజలమీద ఆ పరిస్థితి ప్రభావం లేదు!!

1975లో మొదటిసారి అంతర్గత ఎమర్జెన్సీ విధించబడింది. అత్యంత వివాదాస్పద నిర్ణయం తీసుకున్న ఇందిరా గాంధీ మీద ఆ 'మచ్చ' ఇప్పటికీ తొలగిపోలేదు. అయితే 1975 నాటి పరిస్థితులు, రాజకీయాలు ఒకసారి జ్ఞాపకం చేసుకుందామని, ఇప్పటి తరానికి తెలియజేద్దామని ఈ చిన్న ప్రయత్నం. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడానికి ముందు భారత దేశంలో రెండుసార్లు ఆరేసి ఏళ్ళ చొప్పున అత్యయిక పరిస్థితి కొనసాగుతోంది. అయితే ఇందిర పెట్టిన అత్యవసర పరిస్థితి మాత్రం తీవ్ర ప్రజా వ్యతిరేకతకు దారి తీసింది. అర్ధ శతాబ్ది గడిచినా ఇంకా ఆ నీలి నీడలు ఇందిరమ్మ వ్యక్తిత్వాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యాన్ని తెలియజేసేదే ఈ వ్యాసం..

జవహర్ లాల్ నెహ్రూ కూతురు కాకుండా ప్రధానమంత్రి అంతరంగిక వ్యవహారాలన్నీ చక్కబెట్టే సలహా కూడా ఇందిరా కాంగ్రెస్ వారందరికీ చిరపరిచితురాలు. 1959లోనే కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమింపబడి కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దు చేయటం, చైనాకు వ్యతిరేకమైనా లెక్క చేయకుండా టిబెట్ బౌద్ధ మతగురువు దలైలామాకు భారతదేశంలో ఆశ్రయం కల్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ప్రధానపాత్ర వహించారు. 1964లో తండ్రి నెహ్రూ ఆకస్మిక మరణానంతరం లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని బాధ్యతలు చేపట్టినప్పుడు, ఆయన అభ్యర్ధన మేరకు ప్రభుత్వంలో మంత్రిగా చేరారు. మంత్రిగా ఉండాలంటే ఎం.పి.గా ఉండక తప్పదు కాబట్టి రాజ్యసభ సభ్యురాలయ్యారు. (నెహ్రూ కూతురైనా, అప్పటి వరకు ఆమె ఏ చట్టసభలోనూ సభ్యురాలు కాదు.)

1966లో శాస్త్రి గారి హఠాన్మరణంతో మళ్ళీ రాజకీయ నాయకత్వ శూన్యత ఏర్పడింది. మొరార్జీ దేశాయ్ ప్రధాని పదవికి అన్ని అర్హతలూ ఉన్న నాయకుడు! ఆయనతో వై.బి. చవాన్ పోటీపడొచ్చునని లేదా వారిద్దరికీ రాజీ చేయగలనని పరిశీలకుల అంచనా!!

శాస్త్రిగారి మరణ వార్త వినగానే హుటాహుటిన ఢిల్లీ చేరుకున్న మద్రాస్ ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్ ఆలోచన వేరేవిధంగా ఉంది. నెహ్రూ గారి కూతురుగానే కాకుండా ఆయన ముఖ్య సహాయకురాలిగా ఇందిర ప్రపంచమంతా తిరిగిన మనిషి. ప్రధానిగా ఇందిరైతే వచ్చే ఏడు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవటం సులువవుతుందని కామరాజు అంచనా. అయితే ఆమె నెహ్రూ లాగే సోషలిజం వైపు మొగ్గు చూపుతుందని అందరికీ తెలుసు! అతుల్యఘోష్, ఎస్.కె. పాటిల్, మొరార్జీ దేశాయ్ వంటి నాయకులకు ఇందిర, నెహ్రూల సోషలిస్టు భావాల మీద సదభిప్రాయం లేదు. ప్రధాని పదవికి పోటీ తప్పని సరయ్యింది. దాంతో పార్లమెంట్ భవనంలో జరిగిన ఎన్నికలో ఇందిరకు 355, మొరార్జీకి 169 ఓట్లు వచ్చాయి. (ఉభయ సభలకు చెందిన కాంగ్రెస్ ఎంపీలందరూ ఈ ఓటింగ్‌లో ఉన్నారు.) 24.1.1966న ఇందిరాగాంధీ భారత ప్రధాని అయ్యారు. సోషలిస్టు భావాలున్న ఇందిరకు కేపిటలిస్ట్ భావజాలాన్ని బలపరిచే మొరార్జీ వంటి నాయకుల నుంచి అడుగడుగునా అవరోధాలు ఎదురవుతూనే వచ్చాయి. 1967 సార్వత్రిక ఎన్నికల్లో (అసెంబ్లీలకూ, పార్లమెంట్‌కు కలిసి జరిగిన ఆఖరి ఎన్నికలు) కాంగ్రెస్ పార్టీ గెలిచి ఇందిర ప్రధానిగా ఎన్నికైనా... ఫలితాలు కాంగ్రెస్ బలహీనత పడుతోందనే సంకేతాలు స్పష్టంగా పంపాయి. రాజగోపాలాచారి, ఎన్జీ రంగాల స్వతంత్ర పార్టీ 44 స్థానాలు గెలిచి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచారు. గుజరాత్, మద్రాస్, ఒరిస్సా, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు గెలుచుకోలేకపోయింది. 1962లో నెహ్రూ నాయకత్వంలో 361 సీట్లు గెలిచిన కాంగ్రెస్ 1967లో ఇందిర నాయకత్వంలో 243 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంటే 78 స్థానాలు కోల్పోయింది. నెహ్రూ ఇందిరల సొంత రాష్ట్రం, దేశంలో అతి పెద్ద రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీలో కూడా కాంగ్రెస్ 249 నుంచి 199 స్థానాలకు పడిపోయి అధికారం కోల్పోయింది. భారతీయ జనసంఘ్ (ఇప్పటి బి.జె.పి.), కమ్యూనిస్టులు, ఇంకా ఇతర కాంగ్రెస్ వ్యతిరేక పార్టీల మద్దతుతో చౌదరీ చరణ్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. నెహ్రూ కూతుర్ని ముందు పెట్టుకుని ఎన్నికలకి వెళ్తే కాంగ్రెస్ లాభపడుతుందన్న కామెరాజ్ ప్రయోగం ఫలించలేదు! ఏదైనా సంపూర్ణ చికిత్స చేస్తే గానీ కాంగ్రెస్ నిలబడే అవకాశాలు కన్పించటం లేదు. ఆ సమయంలో ప్రధాని ఇందిర తన తండ్రి సంకల్పించి, అమలు చేయలేకపోయిన 'ఆవడి' కాంగ్రెస్ తీర్మానాలను దులిపి బైటకు తీసింది. ఉప ప్రధాని మొరార్జీ చేతుల్లో ఉన్న ఆర్థిక శాఖను తానే తీసేసుకుంది (ఫలితంగా మొరార్జీ ఉపప్రధాని పదవికి రాజీనామా చేశారు).

**వెంటనే బ్యాంకుల జాతీయకరణను ప్రకటించింది ఇందిరాగాంధీ.**

15.7.1969 నాటికి రూ.50 కోట్లు మించి డిపాజిట్లున్న 14 బ్యాంకులను ప్రభుత్వపరం చేస్తూ ఆర్డినెన్స్ జారీ అయింది. 'దారిద్ర్యం తొలగిద్దాం' గరీబీ హఠావో అనే నినాదంతో ఇందిరాగాంధీ సొంత ఎజెండాను అమలుచేయడం ప్రారంభించింది. కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. భారత రాష్ట్రపతి పదవికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నీలం సంజీవరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్‌ను స్వయంగా ప్రధాని ఇందిర బలపరుస్తూ సంతకాలు కూడా చేశారు. అప్పటి ఉపరాష్ట్రపతి వి.వి.గిరి పోటీగా నామినేషన్ దాఖలు చేశారు. "రాజేంద్ర ప్రసాద్ సమయంలో ఉపరాష్ట్రపతిగా ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి అయ్యారు.. సర్వేపల్లి సమయంలో ఉపరాష్ట్రపతిగా ఉన్న జాకీర్ హుస్సేన్ రాష్ట్రపతి అయ్యారు. అయ్యారు.. నా దగ్గరకొచ్చేసరికి ఎందుకు నన్ను తప్పిస్తున్నారు" అనేది ఆయన వాదన!

కాంగ్రెస్ వ్యతిరేక పక్షాలన్నీ సి.డి. దేశ్‌ముఖ్ గార్ని నిలబెట్టాయి. ఈయన రిజర్వ్ బ్యాంకు గవర్నర్ గాను, నెహ్రూ క్యాబినెట్‌లో మంత్రిగాను పని చేసిన వ్యక్తి (మన దుర్గాబాయమ్మ గారి భర్త).

మొరార్జీ, ఎస్.కె. పాటిల్, అతుల్యఘోష్ వంటి 'సిండికేట్' అని పిలవబడే సోషలిస్టు వ్యతిరేక నాయకులందరూ బలపరిచిన సంజీవరెడ్డి గెలిస్తే.. ఇందిర కథ ముగిసినట్లే! కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రతిపాదించిన 'సంజీవరెడ్డిని ఓడించండి' అని పిలుపునిస్తే.. ప్రధాని పదవి నుంచి తప్పుకోవాలి: అలాగా కథ ముగిసినట్టే!! ఇందిరాగాంధీ సొంత మనుషులందరూ వి.వి.గిరికి ప్రచారం మొదలుపెట్టేశారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డి.పి. మిశ్రా, యంగ్ టర్క్స్ పిలవబడే చంద్రశేఖర్, మోహన్ ధారియా.... ఇందిరకు అండగా వి. వి. గిరినే బలపరుస్తున్నారు. కాంగ్రెస్ నిట్టనిలువునా చీలిపోయింది. ఆ సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు నిజలింగప్ప చేసిన ఒక ప్రకటన ఇందిరకు వరమయ్యింది. సంజీవరెడ్డి ఓడిపోతారేమోనన్న

**భయంతో నిజలింగప్ప భారతీయ జనసంఘ్, స్వతంత్ర పార్టీల మద్దతు కోరడమే ఆ పెద్ద తప్పు!**

కాంగ్రెస్ సిద్ధాంతాలను ముందు నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న 'జనసంఘ్' (ఇప్పటి భారతీయ జనతా పార్టీ) వంటి పార్టీల మద్దతు కోరటం ద్వారా కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడు నిజలింగప్ప పాత్ర ద్రోహం అని.. 'కాంగ్రెస్ వారంతా అంతరాత్మ ప్రబోధం ప్రకారం ఓటు వేయాలని...' ఇందిర బహిరంగంగా ప్రకటించింది. 20.08.1969న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వి.వి.గిరి అంత సులువుగా గెలవలేదు. మొదటి లెక్కింపులో వి.వి.గిరికి నెగ్గటానికి కావల్సినన్ని ఓట్లు రాలేదు. రెండవ లెక్కింపులో వి.వి.గిరి గెలిచారు. అత్యంత ఉద్రిక్తతల నడుమ జరిగిన లెక్కింపు సమయంలో ఇందిరతో ఉన్న డి.పి. మిశ్రా తన ఆత్మకథలో ఇలా వ్రాసుకున్నారు. (డి.పి. మిశ్రా కుమారుడే వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రిన్సిపాల్ సెక్రటరీగా పని చేసిన బ్రజేష్ మిశ్రా). 'వి.వి.గిరి ఓడిపోతున్నారు... ఇప్పుడు నేనేం చెయ్యాలి' అని ఇందిర అడిగితే 'వెంటనే రాజీనామా చెయ్యాలి' అన్నారట మిశ్రా! రాజీనామా రాష్ట్రపతి కివ్వాలంటే రాష్ట్రపతి లేరు.. హుస్సేన్ మరణం వల్లనే ఈ ఎన్నిక.. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ జాకి ఇవ్వాల్సిన మాట..

అయితే మొదటి లెక్కింపులో నెగ్గకపోయినా ఆ తర్వాత లెక్కింపులో పద్ద రెండో ప్రాధాన్యత ఓటుతో వి.వి.గిరి గెలిచారు. అయినా అక్కడితో ఇందిర అధికారకష్టాలు ఆగిపోలేదు. కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం నుంచి ఇందిరను సస్పెండ్ చేశారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ సభ్యులు 429 మంది (లోక్‌సభ రాజ్యసభ కలిపి) 310 మంది ఇందిర వైపు నిలిచారు. అయినా లోక్ సభలో ఇందిర మెజార్టీ కోల్పోయింది. ఇందిరను ప్రధాని పదవి నుంచి వెంటనే దింపేయాలన్న విరోధుల ప్రయత్నాలు సి.పి.ఐ.. డి.ఎమ్.కె. పార్టీలు, మరికొందరు ఇండిపెండెంట్లు తీసుకున్న ఇందిరానుకూల నిర్ణయం వల్ల అమలు కాలేదు. ఇందిరాగాంధీ తెచ్చిన "బ్యాంకుల జాతీయకరణ" ఆర్డినెన్స్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేసింది. రాజభరణాలు (ప్రీవీ పర్సులు) రద్దు చేస్తూ ఇందిర తీసుకున్న నిర్ణయం లోక్‌సభ ఆమోదించినా... రాజ్యసభలో పాస్ కాలేదు. మరోపక్క దేశాన్ని మిలటరీ స్వాధీనం చేసుకుంటుందన్న పుకార్లు బలంగా వ్యాపించాయి. 1970 డిసెంబర్‌లో ఇందిరా గాంధీ లోక్‌సభను రద్దుచేసి మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. 'గరీబీ హఠావో' అంటూ ఇందిర... 'ఇందిర హఠావో' అంటూ వ్యతిరేకులూ నినదించిన ఆ ఎన్నికల్లో 'ఆవుదూడ' గుర్తు మీద దేశవ్యాప్తంగా కాంగ్రెస్ (ఆర్) ఘనవిజయం ఉంది. ('ఆర్' అంటే రిక్విజిషన్) సొంత ఎజెండా, సొంత బలంతో ఇందిర ప్రధానిగా ఎన్నికైంది. స్వయంగా మూడొందల పబ్లిక్ మీటింగ్ మాట్లాడింది. 36,000 మైళ్ళు తిరిగింది. ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలూ అంతటా తానై నిలిచారు. ఇందిరకు భారత ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అధికారం కట్టబెట్టారు. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, పేదలకు ఇళ్ల స్థలాలు, బ్యాంక్ లోన్లు, భూ పరిమితి చట్టం అమలు, లక్షలాది ఎకరాలు నిరుపేదలకు పంపిణీ.. మన శత్రుదేశం పాకిస్తాన్ నుండి విడగొట్టి 'బంగ్లాదేశ్' అనే ఒక దేశాన్ని ఏర్పాటు చేయటంలో ఇందిర ప్రధాన పాత్ర... ఇవన్నీ ఇందిరను జాతీయ అంతర్జాతీయ నాయకురాలుగా నిలబెట్టాయి. 1972లో జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇందిర పేరు మార్మోగింది. నిరుపేదల మనస్సుల్లో ఇందిర 'ఇందిరమ్మ'గా అవతరించింది. అత్యంత ప్రసిద్ధ కలిగిన నాయకురాలుగా ఎదిగిపోయిన ఇందిరను ఎదుర్కొని గెలిగిన, దేశంలో ఆమెను మించి పేరు ప్రఖ్యాతులున్న నాయకులెవ్వరూ లేరు. 1974లో గుజరాత్‌లోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో హాస్టల్ మెస్ చార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ ప్రారంభమైన విద్యార్థుల ఆందోళన.. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి చిమన్ భాయ్ పటేల్ (కాంగ్రెస్) వ్యతిరేక ఉద్యమంగా నవనిర్మాణ ఆందోళనగా రూపాంతరం చెందింది. కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలన్నీ ఉద్యమాన్ని తీవ్రతరం చేశాయి. పైగా ఈ ఉద్యమం చిమన్ భాయ్ పటేల్ కి వ్యతిరేకంగా జరుగుతున్నట్లు కనిపించడానికి వాస్తవంగా ఇది ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమమే. తరువాత జరిగిన సంఘటనలు ఈ మరింత బలపరిచాయి.

సాక్షాత్తు జయప్రకాశ్ నారాయణ్ దిగడంతో.. దాని విలువ విపరీతంగా పెరిగింది. డెబ్బై ఏళ్ళ వయసున్న జయప్రకాశ్ సోషలిస్టు భావాలుగల స్వాతంత్ర్య సమరయోధుడు. విదేశాల్లో చదువుకున్న జయప్రకాశ్, నెహ్రూ గారికి అత్యంత సన్నిహితుడిగా గాంధీగారి ముఖ్య అనుచరుడిగా.. దేశమంతటికీ తెలిసిన వ్యక్తి.


1972లో చంబల్ లోయలోని బందిపోట్లతో సమాలోచనలు జరిపి వారి కష్టాలు తెల్పుకుని వారిని మంచి జీవితాల వైపు మళ్ళించిన జయప్రకాశ్ నారాయణ.. మరోసారి హీరోగా పతాక శీర్షికల్లో కొనియాడ! ఏనాడూ ఏ పదవీ ఆశించని ఈ గాంధేయ విప్లవకారుడు.. గుజరాత్ ఉద్యమంలోకి రావటంతో అతనికి కష్టాలు మొదలయ్యాయి!! మిగిలిన రాజకీయ వాదుల్ని చూసినట్లు ఆమె మచ్చలేని మహామనిషి జయప్రకాశం చూడలేదు కదా.. చిమన్ భాయ్ పటేల్ అవినీతికి వ్యతిరేకంగా గుజరాత్ నవనిర్మాణ సమితి ఆందోళన హింసాత్మకంగా మారటం, కఠినంగా వ్యవహరించడానికి వీల్లేకుండా జయప్రకాశ్ అందులో ముందుండటం.. వంటి కారణాల నేపథ్యంలో 1974 ఫిబ్రవరిలో చిమన్ భాయ్ పటేల్ ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టారు ఇందిర! సంవత్సరం గడిచినా రాష్ట్రపతి పాలనే కొనసాగుతోంది. వెంటనే ఎన్నికలు జరిపించాలంటూ మొరార్జీ స్థాయి వ్యక్తి ఆమరణ దీక్ష చేపట్టడంతో ఇందిరకు మింగలేని పరిస్థితి.

జూన్ 1975లో గుజరాత్ ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రిగా తొలగించబడిన చిమన్ భాయ్ పటేల్ సొంతపార్టీ పెట్టుకుని పోటీ చేసి 12 సీట్లు గెలిచారు. కాంగ్రెస్(ఓ) ('ఓ' అంటే ఆర్గనైజేషన్) జనసంఘ్ భారతీయ లోక్ దళ్ సోషలిస్టు పార్టీలు కలిసి పోటీ చేసి 88 సీట్లు గెలిచాయి. 182 స్థానాలున్న గుజరాత్ అసెంబ్లీలో అధికారంలోకి రావాలంటే 92సీట్లు గెలవాలి. కాంగ్రెస్(ఆర్) ఇందిరాగాంధీ 75 సీట్లు గెలిచింది. చివరికి.. ఏ చిమన్ భాయ్ పటేల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జయప్రకాశ్ నేతృత్వం వహించేంత వరకు ఉద్యమం నడిచిందో అదే చిమన్ భాయ్ పటేల్ 12 మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉద్యమం చిమన్ భాయ్ పటేల్ మీద కాదు, ఇందిరాగాంధీ మీదేనని స్పష్టమైంది!! జయప్రకాశ్ నారాయణ్ ఈ ఉద్యమంలో దిగడంతో ఇందిరా వ్యతిరేక వర్గం వైపు బలం మొగ్గు చూపింది. ఈ ఉద్యమం ఎటువైపు దారితీసేదో ఊహించలేము కానీ మరో అనూహ్య సంఘటన దీన్ని అనుకోని మలుపు తిప్పింది. సరిగ్గా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న జూన్ 12, 1975 నాడే... ఇందిర శిబిరంలో మరో బాంబు పేలింది. అలహాబాద్ హైకోర్టు రాయబరేలీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పిచ్చింది. ఆ ఎన్నికల్లో ఓటమి పాలైన రాజ్ నారాయణ్ పిటిషన్‌లో చేసిన ఆరోపణలపై విచారించిన జస్టిస్ ఇందిర సిన్హా రెండు కారణాల వల్ల ఎన్నిక చెల్లదన్నారు.

1. ప్రభుత్వోద్యోగి యశపాల్ కపూర్ ఉద్యోగానికి రాజీనామా ఆమోదించబడక ముందే ఇందిరాగాంధీ ఎన్నికలో పాల్గొన్నాడనీ.

2. ఇందిర ప్రసంగించిన వేదిక ఖర్చు, వేదికకు సప్లై చేసిన విద్యుత్ చార్జీలు ప్రభుత్వమే చెల్లించిందనీ....

మిగిలిన ఆరోపణలు ఓట్లు కొన్నారనీ, హెలికాప్టర్ ఖర్చు పెట్టారనీ, ఆవు దూడ గుర్తుతో సెంటిమెంట్ రెచ్చగొట్టారనీ.. ఈ ఆరోపణల కేసు అలహాబాదు కోర్టు కొట్టివేసింది ఇందిరాగాంధీని అనర్హురాలిగా తీర్చిస్తూ.. అప్పీలు చేసుకోవటానికి కోర్టు 20 రోజుల టైమిచ్చింది కూడా..! యావద్భారతంలో ప్రతిపక్షాలన్నీ నిరసనలు మొదలయ్యాయి. జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ వంటి అగ్రనాయకులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నానీ ఫాల్కీవాలా అత్యంత ప్రతిభావంతుడైన రాజ్యాంగ నిపుణుడు. ఇందిర అనర్హత చట్టం విరుద్ధమని సుప్రీంకోర్టులో ఇందిర తానే హాజరయ్యాడు. (సుప్రీంకోర్టు వేసవి సెలవుల్లో ఉంది. ఒక్క వెకేషన్ బెంచి మాత్రమే పని చేస్తోంది. అందుచేత అత్యవసరమైనా ఈ కేసు వెంటనే ఉంది. విచారించలేకపోయారు.) అప్పటిదాకా అలహాబాద్ తీర్పును 'స్టే' చెయ్యాలని నానీ ఫాల్కీవాలా బలంగా వాదించారు. న్యాయమూర్తి కృష్ణయ్యర్ కండిషనల్ 'స్టే' చేశారు.. ప్రధానమంత్రిగాను, పార్లమెంట్ సభ్యురాలిగాను కొనసాగిస్తానని.. అయితే లోక్‌సభ సభ్యురాలిగా ఓటు వేసే హక్కు ఉండదనీ ఆదేశాలు ఇచ్చారు! అలహాబాద్ హైకోర్ట్ తీర్పు చెప్పిన పదిరోజులకి జూన్ 22న ఈ 'స్టే' రావటంతో పూర్తి తీర్పు ఇచ్చేవరకూ 'ఇందిరా గాంధీ ప్రధాన పదవికి ఇబ్బంది లేదు' అందరూ భావించినా... అలా జరగలేదు. ఢిల్లీ రామ్ లీల మైదానంలో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభలో జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడారు. అర్హత కోల్పోయిన ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వులను పాటించకూడదని మిలటరీ, పోలీసులకు సమర్పించారు. విద్యార్థులు కాలేజీలకు వెళ్ళడం మానేసి, మరో స్వాతంత్ర్య పోరాటంలోకి దూకాలన్నారు. మొరార్జీ దేశాయ్ గారు అయితే, ఒక విదేశీ జర్నలిస్టు 'ఒరియానా ఫాలసీ'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ. "రేపట్నుంచి ఇందిరను ఇంట్లోంచి బైటకు రానివ్వం... రాజీనామా చేసేవరకూ ఇంట్లోకి బైటకు రాకపోకలు బంద్" అని ప్రకటించారు. ఇలా ప్రకటించిన వీరిద్దరూ ఛోటా నాయకులు కారు! ఇందిర కన్నా సీనియర్లు... పైగా ఆమె తండ్రి జవహర్ లాల్ నెహ్రూతో పని చేసిన దేశ నాయకులు!!.



25.06.1975 అర్ధరాత్రి, ఆర్టికల్ 352(1)ని అనుసరించి భారత అధ్యక్షుడు 'ఫక్రుద్దీన్ అలీ అహ్మద్' దేశంలో అత్యవసర పరిస్థితి అమలులోకి వచ్చింది. ఇందిరా ప్రెసిడెంట్‌కి వ్రాసిన అత్యవసర స్థితిని సిఫార్సు చేసిన ఉత్తరంలోనే క్యాబినెట్ నిర్ణయం తీసుకోకుండానే ఈ సిఫార్సు చేస్తున్నాను, ఆవిధంగా చేయడం బిజినెస్ రూల్స్ ప్రకారం రూల్ 12కి లోబడే చేస్తున్నానని ఆమె చెప్పింది. రేపు తెల్లవారగానే క్యాబినెట్ మీటింగ్ పెడ్తున్నానని కూడా ఆ లేఖలో ప్రస్తావించారు. ఆ విధంగా రాజ్యాంగానికి లోబడే అత్యవసర స్థితి ప్రకటించబడింది. 07.11.1975న సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిల బెంచ్ అలహాబాద్ తీర్పును కొట్టివేసింది (కానీ ఎమర్జెన్సీ ప్రకటించినందుకు నిరసనగా పాల్కీవాలా అభ్యర్థి తరపున వాదించలేదు). ఎమర్జెన్సీ ప్రకటించిన నెలపే... అంటే 230775న లోక్‌సభ ఎమర్జెన్సీ నిర్ణయాన్ని ఆమోదించింది. రెండు రోజుల చర్చ తర్వాత 336 మంది అనుకూలం గానూ, 59 మంది వ్యతిరేకం గానూ ఓటు చేశారు. ఇందిర 'ఎమర్జెన్సీ' ఉదంతం జరిగి యాభై ఏళ్ళు పూర్తయింది! ఇప్పటికీ అదొక చీకటి రాజ్యమని.. ఆమె ఒక నియంత అని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందనీ, ఆమె వ్యతిరేకులు అంటూనే ఉంటారు. రాజ్యాంగంలోంచే ఆర్టికల్ 352 తీయబడిందనీ, ఆ అధికరణం ప్రకారం ఎమెర్జెన్సీ ప్రకటించటం రాజ్యాంగ విరుద్ధమెలా అవుతుందనీ నాలాంటి వాళ్ళకనిపించినా... కాంగ్రెస్ పార్టీయే 'సారీ' చెప్పాక అది తప్పి అయివుంటుంది అనుకుని... ఇక మాట్లాడలేదు!

జూన్ 22న అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు 'స్టే' చేసినా, జయప్రకాశ్ గారూ, మొరార్జీ గారూ ఇందిర రాజీనామా చేయాల్సిందేనని భీష్మించుకుని కూర్చోవటం.. దేశమంతా అల్లకల్లోలం అయిపోయేలా పోలీసులు, మిలట్రీ, ప్రభుత్వదేశాలు పాటించవద్దనీ విదార్థులు కాలేజిల్లోంచి పోరాటంలోకి రావాలనీ' సాక్షాత్తు జయప్రకాశ్ స్థాయి నాయకుడు పిలుపివ్వటం.. ఏ రకంగా సమంజసమో నాకైతే అర్థంకాలేదు. 1976 మార్చిలోపు ఇందిర మళ్ళీ ఎన్నికల కెళ్ళే టైం వచ్చేస్తుంది. ఆర్నెల్ల సమయం మాత్రమే మిగిలింది ఇందిరకు. ఆర్నెల్లలో దేశ ఇందిర వ్యతిరేక ప్రచారం చేసుకునే అవకాశం ఉంది.. వెంటనే రాజీనామా చేయకపోతే 'ఇంట్లోంచి బైటకు రానివ్వం... పోలీసులు, మిలటరీ తిరగబడండి' అని అనవల్సిన అవసరమేంటో...!

యశపాల్ కపూర్ అనే 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ' తన రాజీనామాను ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకు జనవరి 13న పంపించాడు. 25171న ప్రెసిడెంట్ ఆమోద ముద్రపడింది. ఆ ఉత్తర్వుల్లోనే జనవరి 14 నుంచి అతను ఉద్యోగంలో లేడని స్పష్టంగా వుంది (విత్ రెట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్). అయినా 25కి ముందే ఆయన ఇందిర తరపున పార్టీ మీటింగుల్లో పాల్గొన్నాడని ప్రధాని పదవి రద్దయిపోయింది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తి కృష్ణయ్యర్ వంటి జడ్జి 'స్టే' ఇచ్చిన "లెక్క చేయం.. నువ్వు రాజీనామా చేయాల్సిందే" అనటం అంత పెద్ద నాయకుల స్థాయికి తగుతుందా!?

సరే.. ఎమర్జెన్సీ ఎత్తేయటం, ఎన్నికలకు పిలుపునివ్వటం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీ పార్టీ ఓడిపోవటం.. ఆవిడ కూడా ఎమ్.పి.గా గెలవలేకపోవటం.. నిశ్శబ్దంగా అధికార మార్పిడి జరిగిపోవటం.. ఈ చర్యలు కూడా ఆవిడ నియంత్రణలో భాగమేనా!?


1952 నుంచి ఇప్పటి వరకూ ఏ ఎన్నికల్లోనూ ఏ పార్టీ కూడా 50% ఓట్లు సంపాదించి గెలవలేదు. 1984లో ఇందిర హత్యానంతరం 404 లోక్‌సభ సీట్లు గెలిచినప్పుడు కూడా కాంగ్రెస్‌కు పోలైన ఓట్లు 50% లేవు. అలాంటిది.. ఒక 'స్టే' చెయ్యబడ్డ.. పూర్తిగా టెక్నికల్ అయిన కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని ప్రధాని గద్దె దిగాలంటే.. ఎలాంటి దృష్టాంతం (ప్రెసిడెంట్) ఏర్పడుతుంది!?

జయప్రకాష్ నారాయణలాంటి, నెహ్రూ ఇందిరల కన్నా ప్రముఖుడైన సోషలిస్టు, అమెరికా విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో మార్క్సిజం గురించి అధ్యయనం చేసిన వామపక్షం మేధావి నాయకత్వంలో.. స్వతంత్ర, జనసంఘ వంటి క్యాపిటలిస్టు పార్టీలు నడుస్తూ, సోషలిస్టు ఇందిరను ఎలాగైనా దీంపెయ్యాలి అనుకున్నప్పుడు... లొంగిపోవాలా! తిరగబడాలా!!

ఇందిరా గాంధీ తిరగబడింది.. పర్యావసానంగా ఎన్నికల్లో ఓడిపోయింది. పరస్పర విరుద్ధ సిద్ధాంతాలు కలిగిన వారందరూ రెండు ఏళ్ళలో ఏం పరిపాలన కలిసి చేశారో కూడా దేశం చూసింది..! 'ఇందిరాకో బులావో.. దేశ్ కో బచావో' (ఇందిరను పిలవండి దేశాన్ని కాపాడండి) అంటూ 1980లో మళ్లీ ఆమెనే పిలిచి ప్రధాన మంత్రిని చేశారు. (ఇప్పటికి 352 ఆర్టికల్ చిన్న సవరణతో అలాగే వుంది. అంతర్గత అలజడులు (ఇంటర్నల్ డిస్టర్బెన్స్) కు బదులుగా సాయుధ తిరుగుబాటు (ఆర్మ్డ్ రిబిలియన్ అని సవరించారు.)



**ఉండవల్లి అరుణ కుమార్**
**రాజమండ్రి మాజీ ఎంపీ**
**తూర్పుగోదావరి జిల్లా..**



## రహస్యంగా పాక్ అణ్వస్త్ర ప్రయోగం..?

**టీపీఎన్ ప్రతినిధి :**

దాయాది దేశం వక్రబుద్ధి మారడం లేదు. ఎన్ని దెబ్బలు తిన్నా బుద్ధి రావడం లేదు. పాకిస్థాన్ అత్యంత రహస్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నట్లు అమెరికా నిఘా సంస్థలు సంచలన విషయాలు బయటపెట్టాయి. ఈ క్షిపణులు 5 వేల 500 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఛేదించగలవని సమాచారం. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' అనంతరం, పాకిస్థాన్ చైనా సహాయంతో తమ ఆయుధ సంపత్తిని గణనీయంగా పెంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాయి. అమెరికాలోని పలు కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం ఉన్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పాక్ రహస్యంగా తయారు చేస్తోంది. ఈ తరహా ఖండాంతర క్షిపణులను అభివృద్ధి చేయడం లేదా సమకూర్చుకోవాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తే, ఆ దేశాన్ని అణ్వాయుధ ప్రత్యర్థిగా గుర్తిస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం.



## చైనాలో కరోనా వైరస్ లు విజృంభణ

**టీపీఎన్ ప్రతినిధి :**

కరోనా ఖతం అయ్యిందని అందరూ అనుకున్నారు. కానీ కోవిడ్ పుట్టినిల్లు అయిన చైనాలో కొత్త వైరస్ లు పుట్టుకొస్తున్నాయి. కొత్త వైరస్ వ్యాప్తి యూవాన్ ప్రావిన్స్ లో కనిపెట్టారు శాస్త్రవేత్తలు. దాదాపు 22కుపైగా కొత్త వైరస్ వేరియంట్లను కనుగొన్నారు. వాటిలో రెండు ప్రాణాంతకమైనవిగా చెబుతున్నారు. వాటిలో నిఫా..అలాగే హెన్డ్రా వైరస్ లతో ముడిపడి ఉన్నట్టుగా చెబుతున్నారు. భవిష్యత్తులో వణ్య ప్రాణుల నుంచి మానవులకు వ్యాధులు వ్యాప్తి చెందుతాయనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది మెదడు, శ్వాసకోస ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయంటున్నారు. ఈ ఇన్ ఫెక్షన్లు ప్రాణాంతకం కూడా అవుతాయి. దీంతో కోవిడ్ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు అక్కడి సైంటిస్ట్ లు.



## థరూర్ పై ఖర్గే పరోక్ష విమర్శలు

కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించడంపై ఆపార్టీలోని నేతలు తట్టుకోలేకపోతున్నారు. త్వరలో ఆయన బీజేపీలో జాయిన్ అవుతారనే ప్రచారం కూడా జరిగింది. కానీ వాటన్నింటిని కొట్టిపారేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాత్రం శశిథరూర్ పై పరోక్షంగా విమర్శలు చేశారు. కొందరు నేతలు పార్టీ లైన్ ను క్రాస్ చేసి మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనదైన శైలిలో పంచ్ లు వేశారు. దీనిపై స్పందించిన థరూర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఆకాశం..ఎవరికీ చెందదు..రెక్కలు మీవి..ఎగరడానికి ఎవరినీ అనుమతి అడగొద్దు అని ట్వీట్ చేశారు.

# నోబెల్ కు ట్రంప్ నామినేట్..!

**టీపీఎన్ ప్రతినిధి :**




అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కల త్వరలో నెరవేరబోతోంది. తాను ఎన్నో సంక్షోభాలను అరికట్టానని..పలు దేశాల్లో జరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించాని చెప్పారు. 12 రోజులు ఇజ్రాయెల్ఇరాన్ మధ్య జరిగిన యుద్ధాన్ని ఆపానని చెప్పారు. కానీ తనకు నోబెల్ శాంతి బహుమతి తనను వరించకపోవచ్చని తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్ పోస్ట్ చేస్తూ..నేను ఏం చేసినా ..నాకు నోబెల్ ప్రైజ్ రాదు. భారత్‌పాక్ మధ్య యుద్ధం ఆపినా..సెర్బియా, కొసావో మధ్య పోరాటాన్ని నిలిపినా తనకు మాత్రం బహుమతి లభించదని విచారం వ్యాక్తం చేశారు. ఇప్పుడు అలాంటి విచారం అవసరం లేదు. నోబెల్ శాంతి బహుమతి పొందాలన్న ట్రంప్ కొరిక నెరవేరే రోజు దగ్గరలో ఉన్నట్టు తెలుస్తోంది. తాజాగా ఆయన పేరును అధికారికంగా నామినేట్ చేశారు. అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డీ కార్టర్ నార్వేలోని నోబెల్ కమిటీకి ఓ లేఖను పంపించారు. పశ్చిమాసియాలో దాదాపు 12 రోజులుపాటు ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర పోరు సాగింది. రెండు దేశాల్లో నష్టం జరిగింది. అమెరికా పెద్దన్న పాత్ర పోషించి కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చింది. ఇది ఏదో ముందే చేసి ఉంటే బాగుండేది. అలా జరగలేదు. యూఎస్ కూడా యుద్ధంలోకి దిగి ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసింది. హర్మోజ్ జల సంధి మూసివేస్తామని ఇరాన్ ప్రకటించడం పలు దేశాల నుంచి ఒత్తిడి రావడంతో ఆత్మరక్షణలో పడ్డాడు ట్రంప్. ఏదో చేద్దామనుకుంటే ..ఇంకేదో అయ్యిందని భావించాడు. ఇక చేసేది ఏమీ లేక రెండు దేశాల మధ్య సంధి కుదిర్చాడు. సాధారణంగా నోబెల్ శాంతి బహుమతికి ఆయా దేశాల పార్లమెంట్ సభ్యులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, ఇతరులు నామినేషన్లను సమర్పించవచ్చు. సమాజంలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిన వారిని నామినేట్ చేస్తారు. కానీ ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంతో మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకున్నారని గొప్పులు చెప్పుకుంటున్నారు. అందుకేనే అమెరికా ట్రంప్ ను నోబెల్ కు నామినేట్ చేసినట్టు తెలుస్తోంది. ఇరాన్ఇజ్రాయెల్ సీజ్ ఫైర్‌కు ట్రంప్ చేసిన కృషి చేసినందుకు ఈ పురస్కారానికి ట్రంప్ నామినేషన్‌ను సిఫార్సు చేస్తూ నోబెల్ కమిటీకి రిపబ్లికన్ నేత బడ్డీ కార్టర్ లేఖ రాశారు. ఇప్పటికే అమెరికాలో ఆర్థిక మాంద్యం కనిపిస్తోంది. పీకల్లోతు అప్పుల్లో మునిగిపోయింది. ఇరాక్ పై యుద్ధం తర్వాత చాలా వరకు నష్టమే మిగిల్చింది. మరోవైపు ట్రంప్ పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుండటంతో వారి దృష్టిని డైవర్ట్ చేసేందుకు ఆగమేఘాల మీద సీజ్ ఫైర్ కు ఒప్పించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా అమెరికా స్టాక్ మార్కెట్స్ కుప్పకూలడంతో అక్కడ ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఎక్కడ తన సీటుకు ఎసరు తీసుకొస్తుందనే భయంతో డొనాల్డ్ ట్రంప్.. కాల్పుల విరమణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు భారత్ లోని పహల్గామ్ లో పాకిస్థాన్ ఉగ్ర మూకలు మన దేశానికి చెందిన 27 మందిని పొట్టనపెట్టుకుంది. దీనికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో మన మహిళల నుదుటిన సింధూరాన్ని తుడిచివేసిన పాకిస్థాన్ ఉగ్రవాదులే లక్ష్యంగా దాడులు చేసింది. మొత్తంగా పాకిస్థాన్ తో పాటు పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ లోని మొత్తం 9 ఉగ్రవాద శిబిరాలపై లక్షిత దాడుల చేసి వందల మంది టెర్రరిస్టులను మట్టు పెట్టింది. భారత్ దాడులతో నాలుగు రోజులు పాటు పాకిస్థాన్ గజ..గజా వణికిపోయింది. నాలుగు రోజుల్లో పాకిస్థాన్ దాదాపు 25 ఏళ్లు కోలుకోలేకుండా చేసింది. దానికి వైమానిక స్థావరాలను కూడా ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ లో ఉన్న అమెరికాకు చెందిన పలు కేంద్రాలు కూడా ధ్వంసం అయ్యాయి. దీంతో పాకిస్థాన్ భారత్ తో కాళ్ల బేరానికి వచ్చింది. దీంతో ఇరు దేశాలు సీజ్ ఫైర్ కు అంగీకారం తెలిపాయి. ఈ క్రెడిట్ ను తన అకౌంట్ లో వేసుకున్నడు డొనాల్డ్ ట్రంప్. పాకిస్తాన్ పశ్చిమాసియాలో కీలక కేంద్రంలో ఉంది. ఉగ్ర దేశమైన పాకిస్థాన్ ఉన్న భౌగోళిక ప్రాధాన్యత దృష్ట్యా.. దానికి మద్దతు తెలుపుతూ భారత్ తో సంధి కుదిరేలా చేసాడు. మొత్తంగా అంతర్జాతీయ సమాజంలో ఎవరు ఎవరికి మిత్రులు కాదు. ఎవరు ఎవరికి శతృవులు కాదు. మొత్తంగా అమెరికా కూడా మొత్తం ప్రపంచంలో తన ప్రాధాన్యత తగ్గినపుడల్లా.. తన ఆయుధ ప్రయోగాల కోసం యుద్ధాలను రెచ్చగొడుతుంటుంది. ట్రంప్ తాను అధ్యక్షుడైతే.. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని 24 గంటల్లో ఆపుతానని బీరాలు పలికాడు. అధికారంలోకి రాగానే మధ్యలో ఉక్రెయిన్ అధ్యక్షుడితో మాటా మంతీ నడిపినా.. చివరకు ఈ యుద్ధాన్ని మాత్రం నిలువరించలేకపోయాడు. నోబెల్ శాంతి బహుమతిని నార్వే ఇస్తూ వస్తోంది. చూడాలి మరి పెద్దన్న తలచుకుంటే యుద్ధాలనే ఆపేశక్తి ఉంది. ఆయన మనస్సు కోరుకుంటే ఈ నోబెల్ తీసుకోవడం పెద్ద అతిశయోక్తి కాదేమో.

# రష్యాతో ఉద్రిక్తత...అణు శక్తిని పెంచుకుంటున్న బ్రిటన్.!

**టీపీఎన్ ప్రతినిధి :**

బ్రిటన్ తన రక్షణ, అణుశక్తిని పెంచుకోవడానికి ఒక పెద్ద అడుగు వేసింది. అణ్వాయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యం గల 12 F35A ఫైటర్ జెట్‌లను కొనుగోలు చేయబోతోంది. బ్రిటిష్ ప్రభుత్వం దీనిని "ఒక తరంలో బ్రిటన్ అణుశక్తి యొక్క అతిపెద్ద విస్తరణగా అభివర్ణించింది. ఈ చర్య నాటోలో బ్రిటన్ పాత్రను మరింత బలోపేతం చేస్తుంది.



**F-35A జెట్‌లు అంటే ఏమిటి?**

F35A అనేది ఐదవ తరం స్టెల్త్. ఇది రాడార్ నుంచి తప్పించుకుంటుంది, దీనిని ప్రధానంగా అమెరికన్ కంపెనీ లాక్‌హీడ్ మార్టిన్ తయారు చేసింది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఆధునిక ఖరీదైన విమానాలలో ఒకటి.

**అణ్వాయుధాలు సాంప్రదాయ ఆయుధాలు**

ఈ జెట్ అమెరికా తయారు చేసిన B6112 అణు బాంబు, సాంప్రదాయ క్షిపణులు, బాంబులను మోసుకెళ్లగలదు. B6112 బాంబు శక్తి హిరోషిమాపై వేసిన బాంబు కంటే మూడు రెట్లు ఎక్కువ.

**ఎక్కువ దూరం ప్రయాణించే భారీ ఆయుధాలు**

F35A ఫైటర్ జెట్ 2వేల 200 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరాన్ని ప్రయాణించగలవు. ఇది 8,160 కిలోగ్రాముల ఆయుధాలను మోసుకెళ్లగలదు. అధునాతన సాంకేతికత దీని సొంతం. ఇది స్టెల్త్ డిజైన్, యాక్టివ్ ఎలక్ట్రానిక్ స్కాన్డ్ అర్రే రాడార్, డేటా ఫ్యూజన్ వ్యవస్థలను కలిగి ఉంది, ఇది పోరాటంలో అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది.

**F-35B నుంచి తేడాలు**

బ్రిటన్ ఇప్పటికే F35B జెట్‌లను ఉపయోగిస్తోంది. ఇవి విమాన వాహక నౌకల నుండి టేకాఫ్ చేయగలవు. కానీ అవి అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉండవు. F35A భూమి నుంచి ఎగురుతుంది. ఎక్కువ దూరం ప్రయాణించగలదు. అణ్వాయుధాలను మోసుకెళ్లగలదు.

**బ్రిటన్ ప్రణాళికలు..NATOలో పాత్ర**

ప్రపంచంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ముఖ్యంగా రష్యా, చైనా, ఇతర దేశాల నుండి ముప్పు ఉన్న సమయంలో బ్రిటన్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కొనుగోలు వెనుక అనేక ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి...

**నాటో అణు మిషన్‌లో చేరడం**

బ్రిటన్ ఇప్పుడు నాటో యొక్క డ్యూయల్‌కెపాబుల్ ఎయిర్‌క్రాఫ్ట్ (DCA) మిషన్‌లో భాగం కానుంది. ఈ మిషన్‌లో, జెట్‌లు అణ్వాయుధ, సాంప్రదాయ ఆయుధాలను మోసుకెళ్లగలవు. ప్రస్తుతం, అమెరికా, జర్మనీ, ఇటలీ, బెల్జియం, నెదర్లాండ్స్ వంటి ఏడు దేశాలు ఈ మిషన్‌లో పాల్గొంటున్నాయి. అణ్వాయుధాలను ఉపయోగించాలంటే అమెరికా అధ్యక్షుడు, బ్రిటిష్ ప్రధానమంత్రి ఆమోదం అవసరం.

**అణు విద్యుత్ విస్తరణ**

ఇప్పటివరకు, బ్రిటన్ అణుశక్తి పూర్తిగా రాయల్ నేవీకి చెందిన నాలుగు వాన్‌గార్డ్‌క్లాస్ జలాంతర్గాములపై ఆధారపడి ఉండేది. ఇవి ట్రైడెంట్ క్షిపణులను మోసుకెళ్లేవి. F35A జెట్‌ల కొనుగోలు వల్ల బ్రిటన్‌కు మొదటిసారిగా గగనతలం నుంచి అణు దాడిని ప్రయోగించే సామర్థ్యం లభిస్తుంది. మరోవైపు రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు తమ అణుశక్తిని పెంచుకుంటున్నాయని బ్రిటన్ భావిస్తోంది.

**బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ..ఉపాధికి ప్రయోజనం**

F35 కార్యక్రమం BAE సిస్టమ్స్, రోల్స్‌రాయిస్, కోభమ్ వంటి 100 కంటే ఎక్కువ బ్రిటిష్ కంపెనీలకు మద్దతు ఇస్తుంది. ఈ కంపెనీలు జెట్‌ల భాగాలలో 15% తయారు చేస్తాయి, 20,000 ఉద్యోగాలను పొందుతాయి. F35A జెట్‌ల ధర F35B కంటే 25% తక్కువ.. పన్ను చెల్లింపుదారుల డబ్బు ఆదా అవుతుంది.

**RAF విజయం**

రాయల్ ఎయిర్ ఫోర్స్ (RAF) చాలా కాలంగా అణ్వాయుధ సామర్థ్యం గల జెట్‌ల కోసం డిమాండ్ చేస్తోంది. ఈ కొనుగోలు RAF బలాన్ని పెంచుతుంది. ఇది NATO మిషన్లలో దీనికి ముఖ్యమైన పాత్రను ఇస్తుంది. ఈ జెట్‌లు నార్ఫోక్‌లోని RAF మార్హామ్ బేస్‌లో ఉంచబడతాయి

**సహకారం పెంపు**

భారత్ దగ్గర ఇంకా ఐదవ తరం స్టెల్త్ జెట్ లేదు. దాని స్వదేశీ AMCA (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) 2035 నాటికి సిద్ధంగా ఉంటుంది. బ్రిటన్ చర్య భారతదేశం తన రక్షణ సంసిద్ధతను వేగవంతం చేయడానికి ప్రేరేపించవచ్చు. రాఫెల్ , Su30, AMCA ప్రోగ్రామ్‌లను అప్‌గ్రేడ్ చేయడమే. నాటోకు బ్రిటన్ పెరుగుతున్న సహకారం ప్రపంచ స్థిరత్వానికి ముఖ్యమైంది. క్వాడ్ , ఇతర పొత్తుల ద్వారా ఇండోపసిఫిక్ ప్రాంతంలో చురుకుగా ఉన్న భారతదేశం, ఈ మారుతున్న సందర్భంలో బ్రిటన్, నాటోతో సహకారాన్ని పెంచుకోవచ్చు.

# శుభాన్షు అంతరిక్ష యాత్రతో భారత్ కు కలిగే ప్రయోజనాలేంటీ?

**టీపీఎన్ ప్రతినిధి :**

భారతదేశం యొక్క రెండవ రాకేష్ శర్మ శుభాన్షు శుక్లా. ఆక్సియం4 మిషన్ ISS ద్వారా నింగిలోకి దూసుకెళ్లాడు. దాదాపు 14 రోజుల పాటు శాస్త్రీయ ప్రయోగాలు, యోగా , భారతీయ సంస్కృతిని ప్రదర్శిస్తారు. ఈ మిషన్ గగన్‌యాన్ , ప్రపంచ సహకారానికి సన్నద్ధతకు చిహ్నం. భారతదేశ అంతరిక్ష కల ఇప్పుడు కొత్త శిఖరాలను తాకుతోంది . 2025 25 జూన్ భారతదేశానికి ఒక చారిత్రాత్మక రోజు. భారత వైమానిక దళంలో అనుభవజ్ఞుడైన పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా, ఆక్సియమ్ మిషన్4 కింద అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కు ప్రయాణం చేస్తున్నారు. ఇది భారత దేశానికి రెండవ రాకేష్ శర్మ క్షణం. ఇది శాస్త్రీయ విజయం మాత్రమే కాదు, 140 కోట్ల మంది భారతీయుల అంతరిక్ష కలలకు చిహ్నం కూడా. ఈ మిషన్ భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష కూటమి కేంద్రానికి తీసుకువస్తుంది.

**ఒక కొత్త అంతరిక్ష యుగం**

ఆక్సియమ్ మిషన్4 అనేది నాసా, స్పేస్‌ఎక్స్ సహకారంతో ఆక్సియమ్ స్పేస్ నిర్వహిస్తున్న నాల్గవ ప్రైవేట్ అంతరిక్ష



మిషన్. భూమి దిగువ కక్ష్యలో శాశ్వత వాణిజ్య ఉనికిని సృష్టించడం దీని లక్ష్యం. ఈ మిషన్ భారతదేశానికి ప్రత్యేకమైంది. ఎందుకంటే శుభంషు శుక్లా ISSలో నివసించి పనిచేసే మొదటి భారతీయుడు అవుతారు. ఈ మిషన్ ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ ప్యాడ్ 39A నుండి స్పేస్‌ఎక్స్ యొక్క ఫాల్కన్ 9 రాకెట్ , కొత్త క్రూ డ్రాగన్ C213 అంతరిక్ష నౌకతో ప్రారంభించబడుతుంది. కక్ష్య సర్దుబాట్లు...భద్రతా తనిఖీలతో సహా ISS చేరుకోవడానికి 28 గంటలు పడుతుంది. నలుగురు సభ్యుల బృందం 14 రోజుల పాటు ISSలో ఉంటారు, అక్కడ వారు 60 కి పైగా శాస్త్రీయ ప్రయోగాలు చేస్తారు

1984లో రాకేష్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్ళిన భారతదేశం నుండి రెండవ వ్యోమగామి శుభంషు శుక్లా. అతను యాక్స్4 పైలట్ కూడా. ISSలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. అతనితో పాటు... పెగ్గీ విట్సన్ మిషన్ కమాండర్, మాజీ NASA వ్యోమగామి, స్లావోజ్ ఉజ్నాన్స్కివిస్నియెస్కీ పోలాండ్ యొక్క మొదటి ISS వ్యోమగామి టిబోర్ కాపు హంగేరీ యొక్క మొదటి వ్యోమగామి ఉన్నారు.

ఈ నాలుగు దేశాల బృందం అంతరిక్షంలో ప్రపంచ సహకారానికి చిహ్నం. ఆక్సియమ్ వంటి ప్రైవేట్ కంపెనీలు ఇప్పుడు అంతరిక్షంలో కొత్త దేశాలకు అవకాశాలను కల్పిస్తున్నాయని ఇది చూపిస్తుంది. శుభాన్షు ISSలో అనేక ముఖ్యమైన పనులు చేస్తారు. అంతరిక్షంలో మెంతులు పెంచడం వంటి 60 కి పైగా ప్రయోగాలు చేస్తారు. మానవ శరీరంపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావంపై అధ్యయనం. భౌతిక శాస్త్రం, కృత్రిమ మేధస్సుపై పరిశోధన జరుపుతారు.

**గగన్‌యాన్ భారతదేశ అంతరిక్ష కల**

2019లో ఆమోదించబడిన భారతదేశ గగన్‌యాన్ కార్యక్రమం.. 2026లో స్వదేశీ రాకెట్‌పై భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపుతుంది. కానీ ఇందులో చాలా సవాళ్లు ఉన్నాయి.. 2023లో భారతదేశం ISS మిషన్ కోసం అంతర్జాతీయ సహకారాన్ని ప్రతిపాదించింది. 2024లో అమెరికాతో ఒప్పందం తర్వాత, ఆక్సియమ్ స్పేస్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఇది భారతదేశానికి అధునాతన సాంకేతికత .. మానవ అంతరిక్ష విమాన అనుభవాన్ని అందిస్తుంది. ఇది గగన్‌యాన్ మిషన్‌ను వేగవంతం చేస్తుంది. ఆక్సియం4 భారతదేశానికి ఒక ప్రారంభం మాత్రమే. మన దేశానికి ముందు పెద్ద లక్ష్యాలు ఉన్నాయి.

**భారతదేశ అంతరిక్ష భవిష్యత్తు**

శుభాన్షు మిషన్ ఈ కలలకు పునాది వేస్తుంది. ఇది భారతదేశాన్ని అంతరిక్షంలో అగ్రగామి దేశాల వర్గంలోకి తీసుకువస్తుంది. ఆక్సియమ్ మిషన్4తో, శుభాన్షు శుక్లా మనదేశాన్ని ప్రపంచ అంతరిక్ష వేదికపై ప్రకాశింపజేశారు. ఈ ప్రయోగం భారతదేశానికి ఒక చారిత్రాత్మక క్షణం. ఈ మిషన్ శాస్త్రీయ పురోగతిని సూచించడమే కాకుండా, భారతదేశం యొక్క అంతరిక్ష కలలను కూడా నిజం చేస్తుంది. శుభాన్షు ప్రయాణం గగన్‌యాన్, ఇండియన్ స్పేస్ స్టేషన్ .. మూన్ మిషన్ వైపు ఒక పెద్ద అడుగు. ఈ అంతరిక్షయాత్రతో భారత్ కు అనేకప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు ఇస్రో మాజీ ఛైర్మన్ సోమ నాథ్. విశ్వంలోని అనేక రహస్యాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు.





## ఉద్యోగులకు మరోసారి షాక్ ఇవ్వనున్న మైక్రోసాఫ్ట్

ఏఐ టెక్నాలజీ వచ్చాక ఐటీ ఉద్యోగులకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఇటీవల కాలంలో సాఫ్ట్‌వేర్ రంగాన్ని లేఆఫ్‌లు కుదిపేస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ దిశగా టెక్ పరిశ్రమలు పరుగులు పెడుతున్నాయి. మరోవైపు అనేక దిగ్గజ ఐటీ సంస్థలు ఉద్యోగుల తొలగింపులు చేపడుతున్నాయి. గూగుల్, మెటా, అమెజాన్, సేల్స్‌ఫోర్స్ వంటి ప్రముఖ సంస్థలు ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించాయి. ఇప్పుడు మైక్రోసాఫ్ట్ వంతు వచ్చింది. భారీగా ఉద్యోగాల కోతకు రెడీ అయ్యింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6 వేల మందికి పైగా ఉద్యోగులను తొలగించింది. వచ్చేవారం మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించనున్నట్లు సమాచారం. దీంతో ఎప్పుడు ఎలాంటి న్యూస్ వినాల్సి వస్తోందనని టెన్షన్ పడుతున్నారు ఎంప్లాయిస్.



## మహిళలకు గుడ్ న్యూస్..తగ్గిన బంగారం ధర

మహిళలకు గుడ్ న్యూస్. ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో బంగారం ధరలు దిగి వస్తున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య సీజ్ ఫైర్ అమల్లోకి రావడంతో గోల్డ్ రేట్స్ తగ్గుముఖం పడుతున్నాయి. యుద్ధం జరిగిన 12 రోజులు బంగారం ధరలు ఆకాశాన్ని తాయాకి. 10 గ్రాముల స్వచ్ఛమైన గోల్డ్ లక్ష రూపాయాలను దాటేసింది. ఇక సామాన్యుడు బంగారన్ని చూడటమే కానీ.. కొనలేదని డిసైడ్ అయిపోయారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేదు. ప్రశ్చిమాసియా ప్రశాంతంగా మారిపోవడంతో బంగారం పరుగులకు బ్రేక్ పడినట్టు అయ్యింది. ఒక దశలో గోల్డ్ రేట్ ఆల్ టైం రికార్డ్ స్థాయిని దాటి ముందుకు తీసుకెళ్లింది. అక్కడి నుంచి బంగారం ధర నెమ్మదిగా తగ్గింది. అమెరికా మార్కెట్లో బంగారం ధర తగ్గుముఖం పడుతోంది. యూ యూఎస్ ఫ్యూచర్స్ మార్కెట్ కమోడిటీ ఇండెక్స్ సూచి కామెక్స్ ప్రకారం ఒక ఔన్స్ పసిడి ధర రూ. 3,338 డాలర్లకు పతనం అయ్యింది. ఒక్క రోజులోనే 60 డాలర్ల మేర తగ్గింది. ఈ లెక్కన చూస్తే భారతీయ కరెన్సీలో రూ. 5000 తగ్గినట్టే.



## 2027 నాటికి 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ:పీయూష్ గోయల్

2027 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందనే ధీమా వ్యక్తం చేశారు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్. భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించే దిశగా పయనిస్తోందన్నారు. రాబోయే మూడేళ్లో ఈ మైలురాయిని చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రభుత్వం, వ్యాపార సంఘాలు, పరిశ్రమలు, వాణిజ్య వర్గాలతో పాటు మొత్తం 140 కోట్ల మంది భారతీయులను కలుపుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'వికసిత్ భారత్ 2047' దార్శనికతతో ముందుకు వెళ్తున్నారు. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం క్వాంటం మార్పుపై దృష్టి పెట్టింది. వృద్ధిపై మాత్రమే కాకుండా సమ్మిళిత, స్థిరమైన వృద్ధిపై దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు. దేశాన్ని శక్తివంతమైన ఆర్థికవ్యవస్థగా మార్చే క్రమంలో భారత్‌కు ఉన్న బలహీనతలను సరిదిద్ది ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరుకుంటున్నామని, ప్రస్తుతం మనదేశం అంతర్జాతీయంగా మెరుగైన స్థితిలో ఉందన్నారు. ద్రవ్యోల్బణం విషయంలోనూ ఇప్పటివరకు చూడని అత్యల్పం 3 శాతానికి తగ్గించగలిగామని పీయుష్ గోయల్ చెప్పారు. దేశాన్ని డిజిటల్ మార్కెట్‌గా నిలిపేందుకు వచ్చే పదేళ్లు ఎంతో కీలకమని తెలిపారు.

# సానుకూల సంకేతాలు.. అదరగొట్టిన సూచీలు





దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీగా లాభపడ్డాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడంతో బెంచ్‌మార్క్ సూచీలు దుమ్మురేపాయి. యూఎస్ ఫెడ్ ఛైర్‌పర్సన్ జెరోమ్ పావెల్ మున్ముందు వడ్డీరేట్లు తగ్గిస్తామన్న సంకేతాలు ఇవ్వడమూ ఇందుకు దోహదం చేసింది. దీంతో ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లు పరుగులు పెట్టాయి. మరోవైపు ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధమూ నిలిచిపోవడం మేలు చేసింది. మొత్తంగా నిఫ్టీ 200, సెన్సెక్స్ 700 పాయింట్ల మేర ఎగిశాయి. నిఫ్టీ 25,244 వద్ద ముగియడం విశేషం. క్రితం సెషన్లో 82,055 వద్ద ముగిసిన బీఎస్‌ఈ సెన్సెక్స్ బుధవారం 82,448 వద్ద మొదలైంది. 82,339 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 82,815 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 700 పాయింట్ల లాభంతో 82,755 వద్ద ముగిసింది. 25,150 వద్ద ఆరంభమైన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 25,125 వద్ద కనిష్ఠ, 25,266 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 200 పాయింట్లు ఎగిసి 25,244 వద్ద స్థిరపడింది. ఇక బ్యాంకు నిఫ్టీ 159 పాయింట్లు పెరిగి 56,621 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50లో 41 కంపెనీలు లాభపడగా 9 నష్టపోయాయి. టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, గ్రాసిమ్, ఇన్ఫీ టాప్ గెయినర్స్. బీఈఎల్, కొటక్ బ్యాంకు, ఐచర్ మోటార్స్, ఓఎన్జీసీ, యాక్సిస్ బ్యాంకు అత్యధికంగా నష్టపోయాయి. నేడు మీడియా, ఐటీ, హెల్త్‌కేర్, కన్జూమర్ డ్యురబుల్స్, ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, రియాల్టి, ఫైనాన్స్, మెటల్ సూచీలు ఎక్కువ ఎగిశాయి. ప్రైవేటు బ్యాంకు సూచీ స్వల్పంగా ఎరుపెక్కింది. ఎన్‌ఎస్‌ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ బయ్యర్లకు అనుకూలంగా మారింది. 2990 స్టాక్స్ ట్రేడవ్వగా 135 లాభపడ్డాయి. 776 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 51 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 23 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 106, లోయర్ సర్క్యూటును 45 షేర్లు చేరాయి. మార్కెట్ ముగిసే సమయానికి హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీవోకు మొదటిరోజు 0.29రెట్ల స్పందన లభించింది. రూ.3440 టార్గెట్ ధరతో లాల్‌పత్ ల్యాబ్‌కు నువామా బయ్ రేటింగ్ ఇచ్చింది. సంభవ్ స్టీల్ ఐపీవోకు తొలిరోజు మధ్యాహ్నానికి 0.47రెట్ల స్పందన వచ్చింది. అమెజాన్ వెబ్ సర్వీసుతో టాటా టెక్నాలజీస్ కొలాబరేట్ అయింది. ఝార్ఖండ్‌లో కోల్ మైనింగ్ బ్లాక్ అభివృద్ధి కోసం రూ.4801 కోట్ల విలువైన ఆర్డరును కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్ గెలుచుకుంది. రూ.700 టార్గెట్ ధరతో జేఎస్‌డబ్లూ ఎనర్జీకి జెఫ్రీస్ బయ్ రేటింగ్ రిటెయిన్ చేసింది. ఇంటర్నేషనల్ బ్యాటరీ కంపెనీలో హిమాద్రి స్పెషాలిటీ కెమికల్స్ 16.24% వాటా కైవసం చేసుకుంది. ఏప్రిల్‌లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్కెట్ విలువ 64.1% నుంచి 64.6 శాతానికి పెరిగింది. రెండో రోజు మధ్యాహ్నానికి కల్పతరూ ఐపీవోకు 0.31 రెట్ల స్పందనే లభించింది. జర్మన్ డిఫెన్స్ కంపెనీ నుంచి రిలయన్స్ డిఫెన్స్ కంపెనీ రూ.600 కోట్ల విలువైన ఆర్డర్ పొందింది. క్యూఐపీ విధానంలో 28.72లక్షల షేర్లను కేటాయించి కేనెస్ టెక్నాలజీ రూ.1600 కోట్లను సమీకరించింది.

**మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్**

మ్యాక్స్ హెల్త్‌కేర్ Q4 FY25లో బలమైన పనితీరును కనబరిచింది, నికర లాభం సంవత్సరానికి 21% పెరిగి ₹376 కోట్లకు చేరుకుంది. స్థూల ఆదాయం 29% పెరిగి ₹2,429 కోట్లకు చేరుకుంది, దీనికి కారణం దాని ఆసుపత్రులు మరియు ఆరోగ్య సంరక్షణ సేవలలో బలమైన వృద్ధి. EBITDA కూడా 26% పెరిగి ₹632 కోట్లకు చేరుకుంది. మ్యాక్స్ హెల్త్‌కేర్ విస్తరణ రీతిలో ఉంది, 2028 నాటికి 3,700 పడకలను జోడించడానికి ₹6,000 కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది, అప్పటికి దాదాపు 30 ఆసుపత్రులను లక్ష్యంగా పెట్టుకుంది. అధిక ఆక్యుపెన్సీపై కంపెనీ దృష్టి, ఆక్యుపెన్సీకి సగటు ఆదాయం (ARPOB) పెరుగుదల మరియు అంతర్జాతీయ రోగుల ప్రవాహం భవిష్యత్ వృద్ధికి కీలకమైనవి.

**టైటాన్ కంపెనీ లిమిటెడ్.**

టైటాన్ 25 ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికంలో ఘనమైన లాభాలను నమోదు చేసింది, ఏకీకృత నికర లాభంలో 10.7% YYY పెరుగుదల ₹870 కోట్లకు మరియు కార్యాచరణ ఆదాయాలు 19.7% YYY పెరుగుదలతో ₹13,477 కోట్లకు చేరుకుంది. ఆభరణాల వ్యాపారం ఆదాయంలో 25% పెరుగుదలను నమోదు చేయగా, గడియారాలు మరియు ధరించగలిగే వస్తువులు 20% పెరుగుదలను చూశాయి. ప్రపంచ బంగారం ధరలు పెరిగినప్పటికీ, టైటాన్ బలమైన డిమాండ్ ధోరణుల నుండి, ముఖ్యంగా ఆభరణాల విభాగంలో, లాభం పొందుతూనే ఉంటుందని భావిస్తున్నారు. ప్రకాశవంతమైన ఆభరణాల దృక్పథం మరియు లాభదాయకతను మెరుగుపరుస్తూ, మాక్వేరీ ₹4,150 లక్ష్య ధరతో 'అవుట్‌పెర్ఫార్మ్' రేటింగ్‌ను పునరుద్ఘాటించారు.

**టీవీఎస్ మోటార్ కంపెనీ లిమిటెడ్**

టీవీఎస్ మోటార్ 25 ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికంలో బలమైన లాభాలను నివేదించింది, ఏకీకృత నికర లాభంలో 68% YYY పెరిగి ₹648.1 కోట్లకు చేరుకుంది మరియు కార్యకలాపాల నుండి వచ్చే ఆదాయంలో 16% పెరిగి ₹11,542 కోట్లకు చేరుకుంది. ఎగుమతులు సహా ద్విచక్ర మరియు త్రిచక్ర వాహనాల అమ్మకాలు Q4లో 14% పెరిగి 12.16 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలతో సహా విభాగాలలో TVS మోటార్ యొక్క స్థిరమైన వృద్ధి, పోటీ ఆటో మార్కెట్‌లో దానిని బాగా ఉంచుతుంది. దాని నిరంతర పనితీరుపై విశ్వాసాన్ని సూచిస్తుంది. ఉత్పత్తి ఆవిష్కరణ మరియు విస్తరిస్తున్న మార్కెట్ పరిధి (ఎగుమతులుతో సహా)పై కంపెనీ దృష్టి దాని ఊపును నిలబెట్టుకుంటుందని భావిస్తున్నారు.

**JSW స్టీల్ లిమిటెడ్**

JSW స్టీల్ FY25లో 27.791 మిలియన్ టన్నుల అత్యధిక ముడి ఉక్కు ఉత్పత్తిని మరియు 26.452 మిలియన్ టన్నుల అమ్మకపు ఉక్కు అమ్మకాలను సాధించింది. Q4 FY25కి, ముడి ఉక్కు ఉత్పత్తి 7.633 మిలియన్ టన్నులు (సంవత్సరానికి 12% పెరుగుదల), మరియు విక్రయించదగిన ఉక్కు అమ్మకాలు 7.49 మిలియన్ టన్నులు (సంవత్సరానికి 11% పెరుగుదల). JSW స్టీల్ యొక్క భవిష్యత్తు దృక్పథం సానుకూలంగా ఉంది, ముఖ్యంగా ప్రభుత్వం యొక్క నిరంతర మూలధన వ్యయ ఒత్తిడి కారణంగా బలమైన దేశీయ డిమాండ్ కారణంగా ఇది నడుస్తుంది. 2025 నాటికి దేశీయ ముడి ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 37 మెట్రిక్ టన్నులకు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

**జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ లిమిటెడ్ (JFL)**

భారతదేశంలో డొమినోస్ పిజ్జా ఆపరేటర్ అయిన జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్, 33.6% ఆదాయం ఉన్నప్పటికీ, Q4 FY25లో నికర లాభంలో గణనీయమైన 76.86% క్షీణత ₹48 కోట్లకు చేరుకుందని నివేదించింది.

# Q4FY26లో ఎన్‌ఎస్‌ఈ ఐపీవో!

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీకి ఎన్నాళ్లో వేచిన ఉదయం రాబోతోంది. ఐపీవోకు మార్గం దాదాపుగా సుగమమైందని తెలుస్తోంది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీతో వివాదం ముగింపు దశకు చేరుకుందని సమాచారం. కోలొకేషన్, డార్క్ ఫైబర్ వివాదాలను పరిష్కరించేందుకు సెబీ సిద్ధమైనట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. జులై రెండో వారానికి వ్యవహారం కొలిక్కి వస్తుందని అంచనా వేశాయి.

ఐపీవోకు రావాలని ఎన్‌ఎస్‌ఈ ఎనిమిదేళ్లుగా ప్రయత్నిస్తోంది. తొలిసారి 2016లో సెబీ వద్ద నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసింది. 2019 నవంబర్, 2020లో రెండుసార్లు, 2024 ఆగస్టులోనూ సంప్రదించింది. పైన చెప్పిన రెండు వివాదాలు కొలిక్కిరాకపోవడంతో సెబీ అనుమతి ఇవ్వలేదు.

డేటాను త్వరగా యాక్సెస్ చేసేందుకు ఎన్‌ఎస్‌ఈ సర్వర్‌కు సమీపంలో కొందరు బ్రోకర్లు భౌతికంగా వారి సర్వర్లను నెలకొల్పినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌ఎస్‌ఈ ఫెసిలిటీస్‌ను దోచుకొని అనుచిత లబ్ధి పొందినట్టు విమర్శలు వచ్చాయి. అలాగే డార్క్ ఫైబర్ ద్వారా కొందరు బ్రోకర్లకు ప్రాధాన్య పద్ధతిలో యాక్సెస్ ఇచ్చినట్టు తెలియడంతో ఎన్‌ఎస్‌ఈకి సెబీ పెనాల్టీ విధించింది. ప్రస్తుతం ఈ రెండు వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని ఎన్‌ఎస్‌ఈ నిర్ణయించుకుంది. సెబీ శాఖలను అనధికారికంగా సంప్రదించి చర్చించింది. ఇప్పుడీ వ్యవహారం సెబీ అంతర్గత కమిటీ వద్దకు చేరుకొంది. వారి తర్వాత రెగ్యులేషన్ డిపార్టుమెంటు, తర్వాత హై పవర్డ్ అడ్వైజరీ కమిటీ ఆన్ సెటిల్మెంట్‌కు చేరుకుంటుంది.

సెబీ ఎన్‌ఓసీ ఇవ్వగానే ఎన్‌ఎస్‌ఈ ఐపీవో ప్రొసీడింగ్స్ ఆరంభించనుందని సమాచారం. డీఆర్‌హెచ్‌పీ ప్రాసెస్‌కు 45 నెలల సమయం పడుతుంది. మర్చంట్ బ్యాంకర్ల నుంచి సెబీ




కొన్ని ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకొనేందుకు 23 నెలలు పడుతుంది. ఇవన్నీ సవ్యంగా సాగితే ఈ ఆర్థిక ఏడాది చివరి త్రైమాసికానికి ఎన్‌ఎస్‌ఈ ఐపీవోకు వస్తుంది.

ఎన్‌ఎస్‌ఈలో ప్రభుత్వ రంగ సంస్థలకు 31% వాటా ఉంది. ఈ విలువ రూ1.7లక్షల కోట్లకు పైమాటే. స్టాక్‌మార్కెట్లలో ఎన్‌ఎస్‌ఈ లిస్ట్ అయితే ఆ సంస్థలు భారీగా లాభపడే అవకాశముంది. ఎల్ఐసీ వంటి సంస్థలకైతే అదనపు ఈక్విటీ అవసరం లేకుండా వ్యాపారాన్ని



# తొలి టెస్టు ఓటమి.. నెక్స్ట్ ప్లాన్ ఏంటంటే?

ఇంగ్లాండ్ తో తొలి టెస్టులో టీమిండియా ఓటమిపాలైంది. ఇక రెండో టీమ్ కోసం భారత జట్టులో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి సీనియర్లు లేకుండా ఆడిన ఈ టెస్టులో ఇంగ్లండ్ తొలి మ్యాచ్‌లోనే ఓటమిపాలైంది. హెడింగ్లీ టెస్టులో ఐదుగురు టాప్ ఆర్డర్స్ బ్యాట్స్‌మెన్ రాణించారు. అయితే, లోయర్ ఆర్డర్ మాత్రం పూర్తిగా తడబడింది. ఇక బౌలింగ్ లో జస్ప్రీత్ బుమ్రా తప్ప.. మిగతా బౌలర్లు ఎవరూ రాణించలేకపోయారు. ప్రత్యర్థి బ్యాటర్లను బౌలర్లు నిలువరించలేకపోవడంతో టీమిండియాకు భారీ నష్టం జరిగింది. రోహిత్ స్థానంలో టీమిండియా టెస్టు పగ్గాలు శుభ్‌మన్ గిల్‌కు బీసీసీఐ అప్పగించింది. కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అయితే, సిరీస్‌లో ఇది ఫస్ట్ మ్యాచ్ కావడంతో భారత్‌కు ఇంకా అవకాశాలున్నాయి. అయితే, లోయర్ ఆర్డర్ రెండు ఇన్నింగ్స్ లోనూ బ్యాటర్లు సరిగ్గా హెల్ప్ చేయలేకపోయారు. లోయర్ ఆర్డర్ బ్యాట్స్ మెన్ రాణిస్తే పరిస్థితి మరోలా ఉండేది. కనీసం మ్యాచ్ ను టైగా కంప్లీట్ చేసే అవకాశం ఉండేది. అదే సమయంలో బౌలర్లు సైతం రెండో ఇన్నింగ్స్‌లో బాగా రాణించలేకపోవడం ఓటమికి మెయిన్ రీజన్. ఫస్ట్ ఇన్నింగ్స్ లో ఐదు వికెట్లు తీసిన మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా సెకండ్ ఇన్నింగ్ లో ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఇంగ్లండ్‌తో జరిగిన ఫస్ట్ మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూర్‌తో తక్కువ బౌలింగ్ చేయించాలనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిర్ణయాన్ని హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ సపోర్ట్ చేశారు. ఈ క్రమంలో జూలై 2 నుండి ప్రారంభమయ్యే సెకండ్ టెస్ట్ లో సెలెక్ట్ చేయడం కష్టంగానే కనిపిస్తుంది. డిసెంబర్ 2023 తర్వాత తన ఫస్ట్ టెస్ట్ ఆడుతున్న శార్దుల్‌ను ఫాస్ట్ బౌలింగ్‌లో బాగా ఉపయోగించుకోలేదు, బ్యాటింగ్‌తో జట్టును డిజప్పాయింట్ చేశారు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 20 బంతుల్లో మొత్తం ఐదు పరుగులు చేశాడు. శార్దుల్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆరు ఓవర్లు, రెండవ ఇన్నింగ్స్‌లో 10 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. ఈ పరిస్థితుల్లో స్పెషలిస్ట్ బౌలర్ గా ఇంపార్టెన్స్ ఇవ్వడంపై క్వశ్చన్స్ వస్తున్నాయి. మ్యాచ్ ఐదోరోజు శార్దూల్ వరుసగా రెండు వికెట్లు తీసి భారతదేశం విజయ ఆశలను పెంచినప్పటికీ.. బౌలింగ్‌లో మాత్రం పదును కనిపించలేదు. ప్రసిద్ కృష్ణ కంటే దారుణంగా బౌలింగ్ చేశాడు. తొలి టెస్టులో టీమిండియా ఎక్కువ ఆధిపత్యం ప్రదర్శించినా.. చివరకు ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. మ్యాచ్ ఐదోరోజు స్పిన్నర్లకు పిచ్ అనుకూలంగా ఉన్నా జడేజా ప్రభావం చూపలేకపోవడంతో జడేజా బౌలింగ్‌పై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బౌలింగ్ విభాగంలో వేరే మార్పులు చేసేందుకు అవకాశాలు కనిపించడం లేదు. తొలి, రెండోటెస్టు మధ్య వారం రోజుల బ్రేక్ ఉంది. ఈ క్రమంలో బుమ్రా ప్లేయింగ్ 11లో ఉంటాడని అనుకుంటున్నారు. మరో వైపు టెస్టుల్లో అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ మళ్లీ జట్టుకు దూరమయ్యే అవకాశం ఉంది. టీమ్ మేనేజ్‌మెంట్ ప్రసిద్ధ్ కృష్ణకే అవకాశాలు ఇవ్వాలని భావిస్తుంది. మరి టీమిండియా నెక్స్ ఎలాంటి వ్యూహాలు ప్లే చేస్తుందో చూడాలి.

# హార్దిక్ పాండ్యాతో రిలేషన్‌పై ఈశా గుప్తా కామెంట్స్..

క్రికెటర్ హార్దిక్ పాండ్యాతో రిలేషన్ పై బాలీవుడ్ యాక్టర్ ఈషా గుప్తా క్లారిటీ ఇచ్చింది. ఇద్దరూ ప్రేమలో ఉన్నట్లుగా సోషల్ మీడియాలో న్యూస్ వైరల్ అయ్యింది. లేటెస్ట్ గా ఓ ఇంటర్వ్యూలో ఈషా గుప్తా తన వ్యక్తిగత జీవితంపై మాట్లాడుతూ క్లారిటీ ఇచ్చింది. కొంతకాలం ఇద్దరం మాట్లాడుకున్నామని.. కానీ, డేటింగ్ చేస్తున్నట్లు అనుకోలేదని చెప్పింది. కొద్దినెలల పాటు మధ్య మాటలు సాగాయని.. ఒకవేళ ఇది జరుగుతుందేమో, జరగదేమో అన్న ఫేజ్ లో ఉండేవాళ్లమని.. మేం డేటింగ్ ఫేజ్ కు చేరుకోకముందే అది ముగిసిపోయిందని చెప్పారు. దాన్ని డేటింగ్ అని చెప్పలేమని, ఒకట్రెండు సార్లు కలిశామని, ముందే చెప్పినట్లుగా, కొన్ని నెలల పాటు మాట్లాడుకున్నామని, ఆ తర్వాత అది ఆగిపోయిందని ఆమె అన్నారు. నిజంగానే వారిద్దరి మధ్య రిలేషన్ షిప్ ఏర్పడే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ఈశా స్పందిస్తూ.. బహుశా జరిగి ఉండేదేమోనని, అనుకున్నంత స్పీడ్ గా విషయాలు ముందుకు సాగలేదని చెప్పారు. సమయం, సందర్భం సరిగ్గా కుదరలేదని ఈశా అన్నారు. ఇద్దరి మధ్యలు ఎలాంటి గొడవలు జరుగలేదని.. మనస్పర్థలు సైతం రాలేదని.. అలా జరగాలని రాసిపెట్టలేదంటే అంటూ ఆమె ఈ సందర్భంగా కామెంట్ చేశారు. అయితే, కాఫీ విత్ కరణ్ హార్దిక్ పాండ్యా సంలచన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కాఫీ విత్ కరణ్ లో షోలో హార్దిక్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఎలాంటి ప్రభావం చూపించలేదని కూడా స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఈషా గుప్తా కెరీర్ విషయానికొస్తే, ఈశా, బాబీ డియోల్‌తో ఎంఎక్స్ ప్లేయర్ వెబ్ సిరీలో నటించింది. ఏక్ బద్నామ్ ఆశ్రమ్ 3 పార్ట్ 2లో కనిపించింది. వన్ డే: జస్టిస్ డెలివర్డ్ మూవీలో డీసీపీ లక్ష్మిరాఠి క్యారెక్టర్ లో కనిపించారు. ప్రస్తుతం ఆమె హేరా ఫేరీ 3 మూవీలో నటిస్తున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా ఇటు సినీ ఇండస్ట్రీలో, అటు క్రికెట్ వరల్డ్ లోనూ ప్రజంట్ ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.



# శుభ్ మన్ గిల్ కెరీర్ లోనే చెత్త రికార్డ్

లీడ్స్‌లో టీమిండియాకు ఇంగ్లాండ్ తో జరిగిన మొదటి మ్యాచ్ ద్వారా శుభ్‌మన్ గిల్ తన కెప్టెన్సీ ప్రయాణాన్ని స్టార్ట్ చేశారు. ఈ మ్యాచ్ లో బ్యాటర్ గా రాణించినప్పటికీ.. కెప్టెన్‌గా తన టీమ్‌ను మాత్రం గెలిపించలేకపోయాడు. బుమ్రా తప్ప మిగతా బౌలర్లు తేలిపోవడం, ఆఖరి ఇన్నింగ్స్ లో బెన్ డకెట్ వండర్ సెంచరీ సాధించడంతో.. టీమిండియా, ఇంగ్లాండ్ చేతిలో అయిదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇలా గిల్ కెప్టెన్‌గా వ్యవహరించిన తొలి మ్యాచ్ లోనే సెంచరీ చేసినా, భారత జట్టు మాత్రం ఓటమి చవిచూడాల్సి వచ్చింది. దీంతో శుభ్‌మన్ గిల్ ఈ విషయంలో.. దిలీప్ వెంగ్ సర్కార్, విరాట్ కోహ్లీ క్యూలో నిలిచాడు. 1987లో అరుణ్ జైట్లీ స్టేడియంలో వెస్టిండీస్‌తో టీమిండియా ఆడిన మ్యాచ్‌కు వెంగ్ సర్కార్ సారథిగా వ్యవహరించాడు. కెప్టెన్ గా అతడికి అదే మొదటి మ్యాచ్. ఆ మ్యాచ్‌లో అతడు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. కానీ ఆ పోరులో టీమిండియా అయిదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. రీసెంట్ గా టెస్ట్ క్రికెట్ కు తన రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ.. 2014 డిసెంబర్‌లో అడిలైడ్ ఓవెల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్ లో టీమిండియా ఫస్ట్ టైమ్ కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించాడు. ఆ మ్యాచ్ లో అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు చేశారు. కానీ టీమిండియా ఆసీస్ చేతిలో 48 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. లేటెస్ట్ గా ఈ లిస్ట్ లో టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా చేరి, ఓ చెత్త రికార్డును తన అకౌంట్ లో వేసుకున్నాడు.





# టెస్ట్ ర్యాంకింగ్స్‌ను అనౌన్స్ చేసిన ఐసీసీ

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ ను లేటెస్ట్ గా అనౌన్స్ చేసింది. ఇంగ్లాండ్ తో తొలి టెస్టుల్లో బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో చెలరేగిన భారత స్టార్ వికెట్ కీపర్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ లో అత్యుత్తమంగా ఏడో ప్లేస్ కు చేరుకున్నాడు. లీడ్స్ లో ఇంగ్లాండ్ తో జరిగిన సిరీస్ లో ఫస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో రెండు సెంచరీలు సాధించాడు. కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ సైతం టాప్ 20లోకి ఎంటర్ అయ్యారు. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో టీమ్ ఇండియా ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఇంగ్లండ్ 82 ఓవర్లలోనే 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించగా.. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. లీడ్స్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో రెండు సెంచరీలు చేసిన రెండో వికెట్ కీపర్‌గా పంత్ నిలిచాడు. అంతకుముందు జింబాబ్వేకు చెందిన ఆండీ ఫ్లవర్ ఒకే టెస్ట్ మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేసిన ఏకైక వికెట్ కీపర్. లీడ్స్ టెస్ట్‌లో పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 134, సెకండ్ ఇన్నింగ్స్‌లో 118 పరుగులు చేశాడు. అదే సమయంలో శుభ్‌మాన్ గిల్ ఐదు స్థానాలు క్రాస్ చేసుకుని టాప్ 20కి చేరుకున్నాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో గిల్ సెంచరీ చేశాడు. టాప్ 20 టెస్ట్ బ్యాట్స్‌మెన్ లిస్ట్ లో ఇండియా నుంచి ముగ్గురు బ్యాట్స్‌మెన్ మాత్రమే ఉన్నారు. పంత్, గిల్ తో పాటు యశస్వి జైస్వాల్ నాలుగో స్థానంలో ఉన్నాడు. లీడ్స్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో యశస్వి సైతం సెంచరీ చేశాడు. టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్ లో పెద్దగా మార్పులు జరుగలేదు. హెడింగ్లీ టెస్ట్‌లో 14వసారి ఐదు వికెట్లు తీసిన తర్వాత భారత ఫాస్ట్ బౌలర్ జస్ ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 62 పరుగులు, సెకండ్ ఇన్నింగ్స్‌లో 149 పరుగులు చేసి ఇంగ్లండ్ విజయంలో కీలకపాత్ర పోషించిన బెన్ డకెట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈక్రమంలో టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ ఓలీ పోప్ మూడు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి, జామీ స్మిత్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నారు. ఇంగ్లండ్ సీనియర్ ప్లేయర్ జో రూట్ నంబర్ వన్ స్థానంలో కొనసాగుతున్నాడు. హ్యారీ బ్రూక్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన కేన్ విలియమ్సన్ మూడోస్థానంలో ఉన్నాడు. లీడ్స్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ బాల్, బ్యాట్‌తోనూ రాణించగా.. ఆల్‌రౌండర్ల జాబితాలో మూడుస్థానాలు మెరుగుపరుచుకొని ఐదోప్లేస్‌కు చేరాడు. టెస్ట్ ఆల్ రౌండర్ల జాబితాలో టీమిండియా ప్లేయర్ రవీంద్ర జడేజా టాప్ ప్లేస్ లో ఉన్నాడు. శ్రీలంకబంగ్లాదేశ్‌తో మధ్య తొలి టెస్ట్ డ్రాగా కంప్లీట్ కాగా.. ఈ మ్యాచ్‌లో బెస్ట్ పర్ఫార్మెన్స్ అందించిన ప్లేయర్స్ ర్యాంకింగ్స్ లో మార్పులు జరిగాయి.




# నీరజ్ చోప్రాకు మరో టైటిల్..

సూపర్ ఫామ్ లో ఉన్న జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా అకౌంట్ లోకి మరో టైటిల్ చేరింది. మంగళవారం 85.29 మీటర్ల డిస్టెన్స్ తో గోల్డెన్ స్పైక్ మీట్‌లో అతడు విన్నర్ గా నిలిచాడు. దక్షిణాఫ్రికాకు చెందిన డౌ స్మిత్ 84.12మీటర్లతో సెకండ్ ప్లేస్ ను అందుకున్నారు. ప్రపంచ మాజీ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ 83.63మీటర్ల డిస్టెన్స్ తో మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. విజేతగా నిలిచినప్పటికీ ప్రదర్శన ఆశించినంత ఉత్తమంగా లేకపోవడంతో నీరజ్ అసంతృప్తిగా కనిపించాడు. 27 ఏళ్ల నీరజ్ ఈ నెల 20న పారిస్ డైమండ్ లీగ్‌లో టైటిల్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అంతకుముందు అతడు దోహాలో 90 మీటర్ల మార్కును అందుకున్నాడు.

# సెకండ్ హాఫ్ లో ప్రభాస్ పర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవెల్



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన కన్నప్ప మూవీ జూన్ 27న రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా సినిమా నుండి భారీ స్థాయిలో ప్రమోషన్స్ జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శివబాలాజీ ఓ ఇంటర్వ్యూలో సినిమా గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేసుకున్నారు. కన్నప్ప గురించి చర్చలు జరుగుతున్న టైం లో తనకు పాత్ర ఇవ్వలేదు. మోహన్ బాబు గారు అడిగి విష్ణుకి చెప్పి శివ బాలాజీ కచ్చితంగా ఉండాలని మహాదేవ శాస్త్రి కొడుకు పాత్రకు తనని తీసుకున్నారని అలా ఈ ప్రాజెక్ట్ లోకి వచ్చానని అన్నారు శివ బాలాజీ. సినిమాలో తన క్యారెక్టర్ డ్యూరేషన్, ఇంపార్టెన్స్ తక్కువే అయినా ఒక గొప్ప సినిమాలో భాగం అవ్వాలనే ఉద్దేశంతో ఇవేమి ఆలోచించలేదని అన్నారు శివ బాలాజీ. న్యూజిలాండ్ లో రెండు నెలలు ఈ సినిమా కోసం ఉన్నాం.. మోహన్ బాబు గారు షూట్ చేసిన అన్నిరోజులు కూడా తాను కూడా షూట్ చేశానని అన్నారు శివ బాలాజీ. తాను ఎప్పుడు డబ్బుల కోసం సినిమాలు చేయాలని అనుకోనని.. మంచి కథలు వస్తేనే చేస్తున్నా అని అన్నారు. పాత్ర నచ్చకపోతే దర్శక నిర్మాతలకు వెంటనే చెప్పేస్తానని అన్నారు శివ బాలాజీ. తను చేసిన రెక్కీ మూవీకి మంచి రెస్పాన్స్ వచ్చింది. సింధూరం అనే సినిమా చేశాను. రెక్కీ 2 ఫీచర్ ఫిల్మ్ గా వస్తుందని చెప్పారు శివ బాలాజీ. కన్నప్ప సినిమా చూశానని చెప్పిన శివ బాలాజీ సెకండ్ హాఫ్ లో ప్రభాస్ ఎంట్రీ తర్వాత నెక్స్ట్ రేంజ్ కి వెళ్తుందని అన్నారు. విష్ణు, ప్రభాస్ పాత్రల మధ్య వచ్చే సీన్స్, డైలాగ్స్ అద్భుతంగా ఉంటాయని అన్నారు. మోహన్ లాల్ ఎంట్రీ కూడా గూస్ బంప్స్ తెస్తుంది. అక్షయ్ కుమార్ క్యారెక్టర్ సర్ ప్రైజింగ్ చేస్తుందని శివబాలాజీ అన్నారు. మోహన్ బాబు గారు ఆఫ్ స్క్రీన్, ఆన్ స్క్రీన్ వేరు వేరుగా ఉంటారు. విష్ణుతో మంచి పరిచయం ఉంది. మాకు పనిచేస్తున్న టైం లో మా మధ్య మంచి బంధం ఏర్పడింది. అలా మేము ఫ్యామిలీ ఫ్రెండ్స్ అయ్యామని అన్నారు. మోహన్ బాబుకి దగ్గరవడం కష్టం ఒక్కసారి దగ్గరైతే ప్రేమతో కట్టిపడేస్తారని అన్నారు శివ బాలాజీ. ఇక తన కెరీర్ గురించి చెప్పిన శివ బాలాజీ.. మొదట్లోనే 3 ఫ్లాపులు పడ్డాయి. ఫస్ట్ హిట్ ఆర్య.. కెరీర్ స్టార్టింగ్ లోనే ఎత్తుపల్లాలు చూశాను. అందుకే ఇప్పుడు ఏ విషయాన్ని అంతగా పట్టించుకోనని అన్నారు శివ బాలాజీ. ఎవరి నుంచి ఏమి ఆశించనని అన్నారు. ఈ పాత్ర మోహన్ బాబు గారు చేయమని అడిగినప్పుడు ఆలోచించాను.. మరీ సైడ్ నిలబడే రోల్ ఎలా చేయాలని విష్ణుని అడిగా.. నీ ఇష్టం అని అన్నాడు.. ఐతే ఈ సినిమాలో ఆ రోల్ చేయకపోతే చాలా మిస్ అయ్యే వాడినని అన్నారు శివ బాలాజీ. కన్నప్ప షూటింగ్ లో అక్షయ్ కుమార్ ని చూసి షాక్ అయ్యాను. ఆయన తెరపై కనిపించే ఫస్ట్ సీన్ కు మనం శివుడు అని ఫిక్స్ అవుతామని.. అంతగా పాత్రలో ప్రేక్షకులను మెప్పిస్తారని అన్నారు శివ బాలాజీ. త్వరలో మోహన్ బాబు గారి ప్రొడక్షన్ లో లీడ్ రోల్ లో ఒక సినిమా వస్తుంది. రెక్కీ 2 కూడా వస్తుందని అన్నారు శివ బాలాజీ.




# ఎన్టీఆర్ వార్ 2.. అప్డేట్ ఎక్కడ?

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ ఇప్పుడు బాలీవుడ్ డెబ్యూకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. బీ టౌన్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి వార్ 2 మూవీలో లీడ్ రోల్ పోషిస్తున్నారు. స్టార్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్ గా యాక్ట్ చేస్తున్న ఆ సినిమాను బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అయాన్ ముఖర్జీ గ్రాండ్ గా రెడీ చేస్తున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ లో భాగంగా రూపొందుతున్న వార్ 2ను ఆగస్టు 14వ తేదీన రిలీజ్ చేస్తామని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతుండగా.. ఇంకాస్త షూటింగ్ పెండింగ్ ఉందని టాక్ వినిపిస్తోంది. కొన్ని సీన్స్ ను ఇప్పుడు మేకర్స్ షూట్ చేస్తున్నారని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హృతిక్, తారక్ తో ఓ సాంగ్ ను షూట్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారని తెలుస్తోంది. ఆ సాంగ్ తో సినిమాకు వావ్ ఫ్యాక్టర్ ను యాడ్ చేయాలని మేకర్స్ చూస్తున్నారట. జులై ఫస్ట్ వీక్ లో షూట్ చేస్తున్నారని టాక్. ఇప్పటికే టీజర్ ను రిలీజ్ చేయగా.. అనుకున్నంత స్థాయిలో ఆడియన్స్ అండ్ ఫ్యాన్స్ నుంచి రెస్పాన్స్ రాలేదని చెప్పాలి. హై ఎండ్ యాక్షన్ అండ్ విజువల్స్ ఉన్నప్పటికీ.. తెలుగులో బజ్ ఎక్కువగా క్రియేట్ అవ్వలేదు. దీంతో సినిమాను ఫుల్ గా ప్రమోట్ చేయాల్సి ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో వార్ 2 మూవీకి ఒకే ఒక స్పెషల్ అట్రాక్షన్ జూనియర్ ఎన్టీఆర్. అందుకే సౌత్ ఇండియాలో త్వరగా మేకర్స్ అమలు చేయాలి. సినిమాను ఫుల్ గా ప్రమోట్ చేయాలి. ఎందుకంటే డైరెక్టర్ కు నార్త్ లో ఉన్నంత బ్రాండ్ వాల్యూ సౌత్ లో ఉండదు. కాబట్టి ఎన్టీఆరే మెయిన్ పిల్లర్ గా మూవీని ప్రమోట్ చేయాల్సిన అవసరం ఉంది. ఇంకా రిలీజ్ కు నెల పైన ఉంది. అందుకే ప్రమోషన్స్ లో వేగం పెంచాలి. తెలుగు ప్రేక్షకుల్లో హైప్ క్రియేట్ చేయకపోతే.. మార్కెట్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. అదే సమయంలో వార్2 మూవీ రిలీజ్ అయ్యే రోజు కూలీ మూవీ కూడా సందడి చేయనుంది. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్, స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబోలో రూపొందుతున్న ఆ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మూవీ కచ్చితంగా హిట్ అవుతుందనే ధీమాను మేకర్స్ ప్రమోషన్స్ తో క్రియేట్ చేశారు. మరి ఇప్పటికైనా అప్డేట్ ఏదైనా ఇస్తారేమో చూడాలి.

# వెంకీ, త్రివిక్రమ్ మూవీపై క్రేజీ బజ్



టాలీవుడ్ విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ క్రేజీ కాంబినేషన్ మూవీ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర క్లాసిక్ హిట్స్‌గా నిలిచాయి. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ కాంబోలో సినిమా తెరకెక్కనుండటంతో ఈ సినిమా ఎప్పుడెప్పుడు పట్టాలెక్కుతోందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అయితే, వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే సినిమాను ఆగస్టు నెలలో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. దీంతో త్వరలో క్యాస్టింగ్‌ను ఫైనల్ చేసి ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించాలని మేకర్స్ భావిస్తున్నారు. ఇక ఈ సినిమా కథ విషయానికి వస్తే.. కంప్లీట్ హ్యూమర్ ఇంటెన్షన్ తో హై లెవెల్ క్లాసీ అండ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా రాబోతుందనే విషయం అర్థం అవుతుంది. ఇక త్రివిక్రమ్, వెంకటేష్ కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ మూవీ ఇప్పటికీ ఎవర్ గ్రీన్ గా నిలిచింది. దీంతో మళ్లీ వీళ్ల కాంబోలో రాబోయే సినిమాపై ఫ్యాన్స్ భారీగా అంచనాలు పెట్టుకున్నారు. ఇక వెంకటేష్ కూడా రీసెంట్ గా అనిల్ రావిపూడితో కలిసి చేసిన సంక్రాంతికి వస్తున్నాం మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో వరుస హిట్స్ తో ఫామ్ లో ఉన్న వెంకటేష్ లైనప్ పై కూడా ఆడియన్స్ కు మంచి ఒపినియన్ ఉంది. మరి ఈ సినిమాతో అటు వెంకీ, ఇటు త్రివిక్రమ్ ఎలాంటి సక్సెస్ ను అందుకుంటారో చూడాలి.

# కూలీ మాస్ అప్డేట్.. చికిటు సాంగ్ నెక్స్ట్ లెవెల్

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ యాక్ట్ చేస్తున్న లేటెస్ట్ మూవీ కూలీ కోసం ప్రేక్షకులు ఏ రేంజ్‌లో ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు లోకేశ్ కనగరాజ్ డైరెక్ట్ చేస్తుండటంతో అభిమానుల్లో ఈ మూవీపై క్రేజీ బజ్ ఏర్పడింది. ఇక ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులు క్రియేట్ చేయడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల అంచనాలను రెట్టింపు చేశాయి. లేటెస్ట్ గా కూలీ సినిమా నుంచి మరో సాలిడ్ అప్డేట్ అయితే ఇచ్చారు. ఈ సినిమాలోని ఓ మాస్ సాంగ్‌ను వారు రిలీజ్ చేశారు. చికిటు అంటూ సాగే ఈ సాంగ్‌ను మ్యూజిక్ వీడియోగా మేకర్స్ రిలీజ్ చేశారు. ఇక మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ మరోసారి అదిరిపోయే క్యాచీ ట్యూన్‌తో కంపోజ్ చేసిన తీరు సూపర్ గా ఉంది. ఇక ఈ మాస్ సాంగ్ కు థియేటర్లలో ప్రేక్షకులు డ్యాన్స్ వేయడం ఖాయమని ఫిల్మ్ యూనిట్ చెబుతోంది. అటు ఈ పాటకు రజినీకాంత్ కూడా తనదైన డ్యాన్స్ స్టెప్స్‌తో ప్రేక్షకులను ఇంప్రెస్ చేశారు. కాగా మరో వర్సటైల్ యాక్టర్ కమ్ డైరెక్టర్ టి.రాజేంద్రన్ కూడా మనకు ఈ మ్యూజిక్ వీడియోలో కనిపిస్తారు. మొత్తానికి మరోసారి రజినీకాంత్, అనిరుధ్ కాంబోలో అదిరిపోయే మ్యూజిక్ ట్రీట్ రానుందని ఈ పాట ప్రూవ్ చేసింది. ఇక ఈ సినిమాలో అక్కినేని నాగార్జున, ఉపేంద్ర, శ్రుతి హాసన్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాని ఆగస్టు 14న వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఇక రజనీకాంత్ రీసెంట్ గా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అదరగొడుతున్నారు. నెక్స్ట్ జైలర్ 2 కూడా రాబోతుంది.






# హరిహర వీరమల్లు ట్రైలర్.. అదిరిపోయే బజ్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గత కొన్నాళ్లు ఏపీ డిప్యూటీ సీఎం పొజిషన్ లో బిజీగా ఉన్నారు. ఇప్పుడు ఆయన కాస్త రిలీఫ్ అవ్వడంతో కమిట్ అయిన సినిమాలపై ఫోకస్ చేస్తున్నారు. ఇలా ఆయన ఒప్పుకున్న సినిమాల్లో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా హరిహర వీరమల్లు మూవీ కూడా ఒకటి. నిధి అగర్వాల్ హీరోయిన్ గా వర్క్ చేస్తున్న ఈ సినిమాకి జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ కెరీర్ లోనే ఫస్ట్ హిస్టారికల్ కమ్ పాన్ ఇండియా భారీ ప్రాజెక్ట్ గా ఈ సినిమా వస్తుంది. దీంతో ప్రాజెక్ట్ అనౌన్స్ చేసిన టైమ్ నుంది హైప్ వేరే లెవెల్లో ఉండేది కానీ సినిమా దాదాపు ఐదేళ్లు ఆలస్యం అయ్యింది. ఇలా ఎట్టకేలకి ఈ ఏడాదిలో రిలీజ్ కాబోతున్న సినిమా ట్రైలర్ కోసం ముందు అంతా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ ట్రైలర్ పై అధికారిక అప్డేట్ ఈ వారం లోనే రాగా మేకర్స్ లేటెస్ట్ గానే సాలిడ్ ఫైనల్ ట్రైలర్ కట్ ని లాక్ చేసేసినట్టుగా తెలుస్తుంది. ఈ వారంలోనే అప్డేట్ వీకెండ్ కి లేదా వచ్చే వారం మొదట్లో ట్రైలర్ ని వదిలేలా ప్లాన్ చేస్తున్నారు అని తెలుస్తుంది. మరి ఈ ట్రైలర్ వస్తేనే చాలా లెక్కలు మారే అవకాశం ఉంది. మరి చూడాలి వీరమల్లు విధ్వంసం ఎలా ఉంటుంది అనేది. దీంతో పాటు పవన్ కళ్యాణ్ మరికొన్ని సినిమాలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.